ఇంటర్ సప్లిమెంటరీలో 4వ స్థానం

- ఒకేషనల్‌లో 2వ స్థానం
- ద్వితీయ సంవత్సరం ఫలితాల విడుదల

నెల్లూరు (విద్య), జూన్ 18: ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జనరల్ విభాగంలో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానం సాధించగా, ఒకేషనల్ విభాగంలో 2వస్థానంలో నిలిచింది. జనరల్ విభాగంలో 4,970 మంది పరీక్ష రాయగా, 3,675 మంది ఉత్తీర్ణులై 74శాతం ఫలితాలు సాధించారు. ఒకేషనల్ విభాగంలో 412 మందికి 325 మంది ఉత్తీర్ణత సాధించి 79శాతం ఫలితాలు సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల విభాగంలో 13, ప్రైవేట్ కళాశాలల్లో 17 జూనియర్ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణతను సొంతం చేసుకున్నాయి. సంక్షేమ గురుకుల పాఠశాలలు 97శాతం, ఎయిడెడ్ కళాశాలలు 89శాతం, కస్తూర్బా కళాశాలలు 76శాతం ఫలితాలను దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కళాశాలల ప్రిన్సిపాళ్లను అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు, విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా అంతా కృషి చేయాలన్నారు. ఈనెల 26న మొదటి సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్‌బోర్డు చర్యలు చేపట్టిందని వివరించారు.

ఏపీపీజీఈ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

- వివిధ విభాగాల్లో ఆరుగురికి పదిలోపు ర్యాంకులు

నెల్లూరు (విద్య), జూన్ 18: ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) నిర్వహించిన ఏపీ పీజీఈ సెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాలోని పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో కోవూరుకు చెందిన కొప్పోలు కార్తీక్ 2వ ర్యాంక్, సివిల్ ఇంజనీరింగ్‌లో నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌కు చెందిన నాగల ఉషాలక్ష్మి 7వ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళెంకు చెందిన వెయ్యాల అమీషా ఒకటవ ర్యాంక్, ఫుడ్ అండ్ టెక్నాలజీలో నెల్లూరు హరనాథపురానికి చెందిన అనుసూరి గౌతమిప్రియ 8వ ర్యాంక్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో కూకటి పవన్‌కళ్యాణ్ 6వ ర్యాంక్, నానో టెక్నాలజీలో ఇందుకూరుపేట మండలం జంగంవారిదొరువుకు చెందిన ఆములూరు జాన్‌డేవిడ్ రెండో ర్యాంక్ సాధించినట్లు సెట్ ఛైర్మన్, ఎస్వీయూ వైస్‌చాన్స్‌లర్ వీ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



మంగళవారం రాత్రి నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న కేంద్రం బృందం సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్‌వో రమణ, ఆర్డీవో మలోల

నేడు కేంద్ర బృందం పర్యటన

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18: జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించిన నష్టాలను అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ సందీప్ శర్మ నేతృత్వంలో మన్ను జీఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్య జిల్లాలో పర్యటించనున్నారు. ముందుగా వారు ఉదయం 10 గంటలకు కలెక్టర్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. 11.30 గంటలకు వర్షాభావ పరిస్థితుల వల్ల జరిగిన నష్టాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. ఈ సందర్భంగా కరువు నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వారికి వివరిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరి కలిగిరి మండలం గంగిరెడ్డిపాలెం చేరుకుంటారు. అక్కడి రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం తెల్లపాడు చేరుకొని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, రైతులతో మాట్లాడతారు. సాయంత్రం ఐదు గంటలకు కొండాపురం మండలం గొట్టిగుండాల గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. తదుపరి గొట్టిగుండాల నుంచి ఒంగోలుకు చేరుకుంటారు. కాగా కేంద్ర బృందం సభ్యులు మంగళవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు.



అశ్వవాహనంపై చాముండేశ్వరి విహారం

ఇందుకూరుపేట, జూన్ 18 : మండలంలోని గంగపట్నం గ్రామంలో వెలిసి ఉన్న చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అశ్వవాహనంపై అమ్మవారు పురవీధుల్లో విహరించారు. ఉభయ కర్తలుగా మూలగల ప్రదీప్, పుల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, సోమ రాజుపల్లి కార్తీక్ సాయి, వైశ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బండి శాంతయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌వో లవన్న తదితరులు(ఫైల్)

నాటి తప్పులకు నేడు శిక్ష?

- ఇరిగేషన్ శాఖలో బిల్లులకు బ్రేక్
- అన్నింటినీ నిలిపివేయాలని ఆదేశాలు
- పంపిన బిల్లులు కూడా వెనక్కు.
- అధికారుల మెడపై నాడు కత్తిపెట్టిన వైసీపీ నేతలు
- పనులు చేయకనే నగదు కాజేసే కుట్ర
- గత ప్రభుత్వ అక్రమాలపై ఎమ్మెల్యేల దృష్టి

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని పెద్దలు అంటుంటారు... ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో ఇది మరోసారి రుజువుకానున్నది. నాడు అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన అరాచకాలకు మూల్యం చెల్లించుకునే రోజులు వచ్చాయి. పనులు చేయకనే బిల్లులు తినేయడం... తూతూమంత్రంగా పనులు చేసి భారీగా బిల్లులు పెట్టుకోవడం.. వంటి అక్రమాలు ఇరిగేషన్ శాఖలో విచ్చలవిడిగా జరిగాయి. అధికారులు ససేమిరా అన్నా వారి మెడపై కత్తి పెట్టి మరీ వైసీపీ నాయకులు దోపిడీ సాగించారు. అందులోనూ ఎఫ్‌డీఆర్, ఓఅండ్ఎం మాటున జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. మరీ ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాల్లో విచ్చలవిడిగా వ్యవహరించారు. టెండర్లు పూర్తవకుండానే పనులు మొదలుపెట్టడం, అవసరం లేకున్నా అగ్రిమెంట్లు రివైజ్ చేసి విలువ పెంచడం, గడువు ముగియకుండానే బిల్లులు అప్‌లోడ్ చేయడం వంటి అనేక చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. చివరి ఏడాదిలో రూ.కోట్ల బిల్లులు సిద్ధమయ్యాయి. వీటిలో కొన్ని బిల్లులు ఇప్పటికే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ కాగా, మరికొన్ని అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

బిల్లులకు బ్రేక్

ఈ క్రమంలో తాజాగా ఈ బిల్లులన్నింటికీ బ్రేక్ పడింది. తాత్కాలికంగా అన్ని బిల్లులను నిలుపుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను కూడా వెనక్కు తెప్పిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.వందల కోట్లు అడ్డగోలుగా దోచుకోగా, ఆ దోపిడీకి ఇప్పుడు బ్రేక్ పడింది. కాగా కొందరు ఇరిగేషన్ అధికారులు ఈ బిల్లులను వైసీపీ నాయకుల చేతికి ఇచ్చి కోర్టుకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారన్న సమాచారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఇరిగేషన్ శాఖ నుంచి ఒక్క ఫైలు కూడా బయటకు వెళ్లేందుకు వీల్లేదని అక్కడి నుంచి ఆదేశాలు అందాయి.

అంతా బినామీ కాంట్రాక్టర్లే..!

వైసీపీ ప్రభుత్వంలో ఎఫ్‌డీఆర్, ఓఅండ్ఎం మాటున భారీ దోపిడీ జరిగింది. మంజూరైన పనులు.. జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. వీటిలో చాలావరకు మట్టి పనులు కావడంతో లెవల్స్ కూడా రికార్డు చేయకుండానే బిల్లులు చేసేలా వైసీపీ నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఆఖరుకు షట్టర్లు కూడా ఏర్పాటు చేయకుండానే చేసినట్లుగా కూడా అధికారుల చేత సంతకాలు పెట్టించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒక్క 2021లో ఎఫ్‌డీఆర్ కింద సుమారు రూ.230 కోట్లకు పైగా పనులు కలెక్టర్ చేత మంజూరు చేయించారు. ఇన్ని రూ.వందల కోట్లు ఎఫ్‌డీఆర్ కింద మంజూరు చేయడంపై రాష్ట్ర ఉన్నతాధికారులే ఆశ్చర్యపోయారు. ఆ మరుసటి ఏడాది మళ్లీ ఓఅండ్ఎం కింద మళ్లీ రూ.వందల కోట్ల పనులకు అనుమతులు తెచ్చారు. ఇలా అగ్రిమెంటు చేసుకోవడం.. అలా పనులు చేసినట్లు రికార్డు చేయడం.. వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయడం.. వాటిని పట్టుకొని హైకోర్టుకెళ్లడం.. వెంటనే బిల్లులు మంజూరు కావడం.. ఇదీ వైసీపీ ప్రభుత్వంలో సాగిన ప్రక్రియ. గతేడాది డిసెంబరులో చాలా వరకూ ఎఫ్‌డీఆర్ బిల్లులు మంజూరయ్యాయి. ఈ ఎఫ్‌డీఆర్, ఓఅండ్ఎం పనులన్నీ నాటి వైసీపీ ఎమ్మెల్యేల బినామీల ద్వారానే జరిగాయి. ఆ పది మంది కాంట్రాక్టర్లే మొత్తం పనులు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఒకరిద్దరు కాంట్రాక్టర్ల పేరు మీద వర్కులు చేసినట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సెంట్రల్ డివిజన్ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఐదేళ్లలో దాదాపు 650 వర్కులు జరిగినట్లుగా రికార్డుల్లో చూపిస్తున్నారు. ఈ వర్కులన్నింటిపై ఆ ముగ్గురి కాంట్రాక్టర్ల హవానే కొనసాగింది. ఒకరేమో నాటి ప్రజాప్రతినిధి ఆర్థిక వ్యవహారాలు చూసే వ్యక్తి కాగా, మరొకరేమో మనుబోలు మండలానికి చెందిన నాయకుడు. ఈ నాయకుడు తర్వాత కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. ఇంకొకరేమో నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్. వీరు చేసిన వర్కులపై విచారణ జరిపితే ఏ స్థాయిలో దోపిడీ జరిగిందో తేటతెల్లమవుతుంది.



దృష్టి పెట్టిన ఎమ్మెల్యేలు

ఇరిగేషన్ శాఖలో రైతుల మాటు వైసీపీ నేతలు సాగిస్తున్న దోపిడీపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడే టీడీపీ నేతలు పోరాటం చేస్తూ వచ్చారు. అనేక అవకతవకలను నాడే వెలుగులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు వారంతా అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో నాడు జరిగిన దోపిడీపై దృష్టి సారించారు. ఎమ్మెల్యేలంతా వారి పరిధిలో వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన, జరిగిన వర్కులు, బిల్లుల వివరాలను తెప్పించు కుంటున్నారు. వీటిని లోతుగా పరిశీలిస్తున్నారు. అదే సమయంలో ఇరిగేషన్ అధికారులు కూడా నాటి పరిస్థితులను ఎమ్మెల్యేలకు వివరిస్తున్నారు. నాడు చేసిన ఆరోపణలు నిజమని ప్రజలకు వివరించేందుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. కాగా నాడు వైసీపీ నేతలు సాగించిన దోపిడీ దెబ్బకు నేడు ఇరిగేషన్ సిబ్బంది విలవిల్లాడి పోతున్నారు. తప్పులను తాము ఒప్పుకోకపోయినా ఉన్నతస్థాయిలో ఒత్తిడి తెచ్చి మెడపై కత్తి పెట్టారని కొందరు అధికారులు వాపోతుండడం గమనార్హం.

68కి ప్రతిపాదనలు.. 24 కేటాయింపు !

- ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ సీట్ల పరిస్థితి
- రూ. 89 లక్షలు ఎన్ఎంసీకి చెల్లింపులు
- మరోసారి అన్నింటికి ప్రపోజల్స్
- పూర్తిగా మంజూరైతేనే మెరుగైన సేవలు



నెల్లూరు (వైద్యం), జూన్ 18 : జిల్లాలోని ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలో పీజీ సీట్ల కేటాయింపు నిరాశజనకంగా ఉంది. పీజీ సీట్ల కోసం కళాశాల తరఫున రూ.లక్షలు చెల్లిస్తున్నా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) కేవలం కొన్ని సీట్లనే మాత్రమే కేటాయిస్తున్నది. 2023లోనే 68 పీజీ సీట్లకు రూ.89 లక్షలు చెల్లించగా, కేవలం 24 పీజీ సీట్లను మాత్రమే కేటాయించింది. తాజాగా ఈ ఉత్తర్వులు ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరాయి. ఇందులో జనరల్ మెడిసిన్‌కు 17 సీట్లు కావాలని కోరగా, మొత్తం సీట్లకు అనుమతులు వచ్చాయి. అలాగే గైనకాలజీలో 15 సీట్లు కోరగా ఏడుసీట్లు కేటాయించింది. ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ , చెవి, ముక్కు, గొంతుతో పాటు రేడియాలజీ విభాగాలకు పీజీ సీట్లు కేటాయించలేదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలలకు కోరుకున్న పీజీ సీట్లు వచ్చాయి. అయితే, నెల్లూరు కళాశాలకు మాత్రం రిక్తహస్తం చూపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డాక్టర్ వసుంధరాదేవి

పీజీ సీట్ల కేటాయింపులు ఇలా...

విభాగం	ప్రతిపాదనలు	అనుమతి
జనరల్ మెడిసిన్	17	17
గైనకాలజీ	15	7
జనరల్ సర్జరీ	15	---
ఆర్థోపెడిక్	12	---
ఈఎన్‌టీ	4	---
రేడియాలజిస్ట్	5	---
మొత్తం	68	24

గతంలోనూ ఇంతే..

గతంలో కూడా పీజీ సీట్ల కేటాయింపులో వివక్ష తప్పలేదు. 2022-23 విద్యా సంవత్సరానికిగాను పీజీలో 130 సీట్లు వస్తాయని ఆశించిన అధికారులకు చివరకు నిరాశే మిగిలింది. కేవలం 23 సీట్లకే అనుమతులు ఇస్తూ ఎన్ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర విభాగాల్లోనూ పీజీ సీట్లకు అనుమతులు ఇవ్వకపోవటంతో వైద్యవర్గాల్లో అసంతృప్తి నెలకొంది. కాగా అనుకున్న స్థాయిలో పీజీ సీట్లు మంజూరయితే, పీసీ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు మెరుగుపడే అవకాశం ఉంది. తాము కోరినన్ని సీట్లు రాక పోవడంతో మరోసారి ప్రతిపాదనలు పంపనున్నట్లు ప్రిన్సిపాల్ వసుంధరా దేవి తెలిపారు.



కొలపనాయుడుపల్లి మైనింగ్ యార్డ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన తెల్లరాయి

వెలుగులోకి మరో అక్రమ మైనింగ్

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పేరుతో మైనింగ్ యార్డ్
- వైసీపీ నాయకుల నిర్వాకం

చేజర్ల, జూన్ 18: మండలంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు పార్టీ నాయకుల చేసిన అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయాయి. అవన్నీ ప్రభుత్వం మారిన వెంటనే ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొలపనాయుడుపల్లి సమీపంలో గురువారం జిల్లా విజిలెన్స్ మైనింగ్ ఏడీ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎమ్‌డీఎల్ అనుమతి పొందిన భూమి అసైన్‌మెంట్ భూమిగా గుర్తించడంతో పాటు పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మినరల్స్ యజమాని వై.సుభరత్నమ్మ పేరుతో అనుమతులు పొంది ఉన్నారు. ఈ మైనింగ్ యార్డ్‌లో 1200 టన్నుల తెల్లరాయి ఉండడంతో పాటు సమీపంలోనే మరో స్థలంలో 350టన్నుల తెల్లరాయి ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మొత్తం 1550టన్నుల తెల్లరాయి నిల్వ ఉన్నట్లు జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. తదుపరి చర్యలు తీసుకునేవరకు రాయిని తరలించకుండా గ్రామ రెవెన్యూ అధికారికి అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. అయితే మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో అసైన్‌మెంట్ భూమిని మైనింగ్‌యార్డ్ మంజూరు చేయడంతో పాటు, వై.సుభరత్నమ్మ అనే ఆమె ఐసీడీస్ ఆదురుపల్లి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా ఉండడంత గమనర్హం. ఈ సంఘటనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలిమరి.



పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మినరల్స్ వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

మగ పెద్దపులి పాదముద్రలు సేకరించాం !

- దానికి ఎలాంటి గాయాలు తగల్లేదు
- రోడ్డు దాటుతుండగా కారు తగిలింది..
- మర్రిపాడు ఘటనపై విచారిస్తున్నాం : డీఎఫ్‌వో

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 18: జిల్లాలోని మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద సోమవారం పెద్దపులి దాడి వల్ల కారు ధ్వంసమైందని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఏ.చంద్రశేఖర్ తెలిపారు. అయితే మగ పెద్దపులి పాదముద్రలను మాత్రం సేకరించామన్నారు. నెల్లూరులోని నిప్పో సెంటర్ వద్ద గల అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘటన జరిగిన ప్రాంతంలో సేకరించిన ఆధారాల మేరకు పెద్దపులిని ఢీకొని కారు భారీ దెబ్బతిన్నదంటే... పులికి కూడా తీవ్రగాయలు కావాలి కదా..? అని ప్రశ్నించారు. ఒకవేళ పులి గాయపడితే ఎక్కడికీ కదలలేదన్నారు. కదిరినాయుడిపల్లి పరిసరాల్లో నాలుగు కిలోమీటర్ల వరకు పెద్దపులి జాడేలేదన్నారు. పులికి గాయాలు అయినట్లు ఆధారాలు లేవన్నారు. దీన్ని బట్టి కారు దేన్ని ఢీకొని దెబ్బతిన్నదో విచారిస్తున్నామన్నారు. ఘటనాస్థలంలో మగ పెద్దపులి పాదముద్రలను సేకరించామన్నారు. కారు డ్రైవర్ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అయితే పెద్దపులి సంచారం ఉన్నట్లు నిర్ధారణ అయినందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేనిదే ఎవరూ అడవిలోకి వెళ్లరాదన్నారు. గతంలో సేకరించిన పాదముద్రలు ఆడపులికి కాగా, ప్రస్తుతం సేకరించినవి మగ పులివని ఆయన వివరించారు.



విలేకరులకు మగ పెద్దపులి పాదముద్రలు చూపుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్



కదిరినాయుడుపల్లి పరిసరాల్లో డ్రోన్ ద్వారా పెద్దపులి ఆనవాళ్ల గాలింపు

అటవీ అధికారుల గాలింపు

మర్రిపాడు, జూన్ 18 : కదిరినాయుడుపల్లి అడవిలో పెద్దపులి ఆనవాళ్ల కోసం మంగళవారం అటవీశాఖాధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర అడవిలో డ్రోన్ ఎగర వేసి తద్వారా వీడియో రికార్డు చేశారు. ఈ ప్రమాదానికి కారణం జంతువుగా భావిస్తున్నా, దాన్ని పులిగా నిర్ధారించలేమని ఆత్మకూరు రేంజర్ శేఖర్ తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఉదయగిరి రూరల్, జూన్ 18: వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రద్దు చేయడంపై మంగళవారం ఉదయగిరి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన ఈ చట్టం వల్ల న్యాయవాదులు ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రైతుల పేరున ఉండాల్సిన ఒరిజినల్ డాక్యుమెంట్లు ప్రభుత్వం దగ్గర ఉండేలా చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నందిరెడ్డి రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శులు నాగార్జున, తిరుపతయ్య, సుభానీబాషా, రాంభూపాల్‌రెడ్డి, అశోక్, అల్తాఫ్, షరీఫ్, మస్తాన్, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, జూన్ 18: గండిపాళెం ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఇంగ్లిష్ టీజీటీ, గణితం పీజీటీ, బయాలజికల్ సైన్స్ పీజీటీ, ఫిజికల్‌సైన్స్ పీజీటీ, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2018 డీఎస్సీ గైడ్‌లైన్స్ ప్రకారం ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తు ఫారంతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలను జత చేసి, ఈనెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు పాఠశాలలో అందజేయాలని ఆయన తెలిపారు.

ఆలయాలకు పూర్వ వైభవం తెస్తాం

- దేవాలయ భూములు, ఆస్తుల పరిరక్షణకు చర్యలు
- రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 : రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి ఆలయాల పూర్వవైభవానికి కృషి చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం నెల్లూరులోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శతాబ్దాల చరిత్ర గల ఆలయాలు ఎన్నో ఉన్నాయని, వాటి పరిరక్షణ, అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడి చర్యలు చేపడుతామన్నారు. దేవదాయ శాఖలో ప్రక్షాళన చేపట్టి సమూల మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి చెప్పారు. అనేక ఆలయాలకు వందల ఎకరాల మాన్యం, ఆస్తులు ఉన్నా ఆయా ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆలయాల భూములు, ఆస్తులను ఇతరులు ఆక్రమించుకుని ఉన్నారని, అలాంటివి చట్టప్రకా రం ముందుకెళతామన్నారు. ఆలయాలను అభివృద్ధి చేసి హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని మంత్రి స్పష్టం చేశారు. కాగా, మంత్రి రామనారాయణరెడ్డిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.


ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి ఆనం

విజిలెన్స్ చేతికి 'ఫోర్జరీ' కేసు

- సొంత శాఖను నమ్మలేక కమిషనర్ నిర్ణయం

నెల్లూరు(సిటీ), జూన్ 18 : నెల్లూరు కార్పొరేషన్‌లో వెలుగుచూసిన ఫోర్జరీ సంతకాల కుంభకోణంపై విచారణను కమిషనర్ వికాస్ మర్మత్ పోలీసు విజిలెన్స్ శాఖకు అప్పగించారు. వాస్తవాలను బయటకు తీసి నిందితులను గుర్తించాలంటూ దర్యాప్తు సంస్థకు లేఖ రాశారు. సాధ్యమైనంత త్వరగా నివేదికను అందించాలని అందులో కోరారు. తొలుత కార్పొరేషన్‌లోని ఉన్నతాధికారులతో కమిటీ వేసి నిజాలు నిగ్గుతేల్చాలని కమిషనర్ నిర్ణయించినప్పటికీ సొంత శాఖపై నమ్మకం కుదరక విజిలెన్స్ విభాగానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆ స్కాంతో సంబంధమున్న నాయకులు, అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఒకటి కాదు రెండు కాదు వందకుపైగా ఫైళ్లలో తన సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చిన కమిషనర్ వికాస్ మర్మత్, ఈ కుంభకోణం వెనుక గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేతల హస్తం ఉందని గుర్తించినట్లు తెలిసింది. కార్పొరేషన్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు కూడా భాగస్వాములైనట్లు అనుమానిస్తున్నారు. ఈ కుంభకోణంలో సుమారు రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. ఈ నేపథ్యంలో ఫోర్జరీ నేరంతోపాటు భారీ స్థాయిలో అవినీతి జరిగినట్లు గుర్తించారు. దీంతో విచారణ బాధ్యతను విజిలెన్స్‌కు అప్పగించారు. అయితే ఈ దర్యాప్తు అంశాన్ని విజిలెన్స్ విభాగం ధ్రువీకరించాల్సి ఉంది.



తుమ్మలపెంట రోడ్డులో రూ.1.5 కోట్ల విలువైన భూమి కబ్జా!

- రాళ్లు నాటి కంచె వేసిన ఆక్రమణదారులు
- అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు
- ప్రభుత్వ స్థలమని బోర్డు పెట్టిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

కావలి రూరల్, జూన్ 18: కావలి పట్టణం తుమ్మలపెంట రోడ్డులో సుమారు రూ.1.5 కోట్ల విలువైన తాళ్లపాలెం చెరువు కలుజు స్థలాన్ని యథేచ్ఛగా కబ్జా చేశారు. చుట్టూ రాళ్లు నాటి పెన్సింగ్ వేశారు. గమనించిన రైతులు ఈ విషయాన్ని మంగళవారం స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి కూత వేటు దూరంలో తుమ్మలపెంట రోడ్డుకు ఆనుకుని ఉన్న చెరువు కలుజు నుంచి ఆయకట్టు పొలాలకు నీరు వెళ్లే కాలువ స్థలం సుమారు 80 అంకణాలను చదును చేసి కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు సోమవారం సాయంత్రం రాళ్లు నాటి ఇనుప కంచె వేశారు. గమనించిన సమీపంలో భూములు కలిగిన రైతు లు, ఆముదాలదిన్నె రైతులు కబ్జాదారులను ప్రశ్నించగా వారు అక్కడ నుంచి జారుకున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా అక్కడకు చేరుకున్న స్థానిక వీఆర్వో చందు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి అది ప్రభుత్వ స్థలం అని, ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బోర్డులు ఏర్పాటు చేశారు. ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుంటామన్నారు.


కబ్జా చేసిన స్థలానికి రాళ్లు నాటి వేసిన కంచె

వ్యాన్ బోల్తా : తప్పిన ప్రమాదం

- టమోటాల కోసం ఎగబడిన జనం

మనుబోలు, జూన్ 18: మండల పరిధిలోని జాతీయ రహదారిపై మనుబోలు ఫ్లైఓవర్‌పై సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో టమోటా వ్యాన్ బోల్తా పడింది. పలమనేరు నుంచి వ్యాన్‌లో సత్తెనపల్లికి టమో టా, బీరకాయ, కీరదోసకాయలను తరలిస్తున్నారు. మనుబోలు ఫ్లైఓవర్ వద్దకు వ్యాన్ రాగానే ముందు వెళు తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. బోల్తాపడిన వ్యాన్ నిండా టమోటాలు, ఇతర కూరగాయలు ఉండడంతో రోడ్డంతా చెల్లాచెదురుగా పడ్డాయి. మంగళవారం తెల్లవారగానే టమోటా వ్యాన్ బోల్తా పడిందని తెలుసు కున్న స్థానికులు హైవేపైకి పరుగులు తీశారు. సందట్లో సడేమియాలా టమోటా ఏరుకునేం దుకు ఎగబడ్డారు. ఈ ప్రమాదంతో తమకు సుమారు రూ.4లక్షల మేర నష్టం వాటిల్లినట్లు వ్యాన్ డ్రైవర్ సురేష్, క్లీనర్ అరవింద్ పేర్కొన్నారు. ఫ్లైఓవర్ వద్దకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాను

ఉపాధ్యాయుడి ఇంట్లో బంగారు నగల చోరీ

పొదలకూరు, జూన్ 18: ఇంట్లో ఎవరూ లేని సమ యంలో తాళాలు పగులగొట్టి దుండగులు బంగారు నగలు దోచుకెళ్లారు.ఈ సంఘటన పొదలకూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని శ్రీనివాసపురంవీధిలో ప్రభు త్వ ఉపాధ్యాయుడు దొరబాబు ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి రెండు సవర్ల బంగారు నగలు దోచుకెళ్లారు. దొరబాబు కుటుంబ సభ్యులతో శుక్రవారం ఊటికి వెళ్లి తిరిగి మంగళవారం ఇంటికి వచ్చి చూసుకునే సరికి ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగిందని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఊరికి వెళ్లే ముందు బంగారు నగలను బంధువులకు ఇవ్వడంతో దొంగలను పెద్దగా బంగారం దొరకలేదు. ఈ మేరకు సీఐ రాంబాబు, ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6807
వెండి కిలో ధర	రూ. 90,100
వెండి ఒక గ్రాము	రూ. 92.10

చంద్రన్న బీమా పేదలకు ధీమా..!

- పథకానికి పూర్వ పరిస్థితి కల్పించాలంటున్న ప్రజలు
- ఆదరణ కోల్పోయే కుటుంబాలకు ఎంతో అండ

అల్లూరు, జూన్ 18: ప్రమాదాల్లో, ఇతర వేరే కారణాలతో ఆదరణ కోల్పోయే పేద కుటుంబాలకు అండగా ఉండేలా ధీమా కల్పించిన చంద్రన్న బీమా పథకానికి పూర్వ పరిస్థితి వచ్చేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చంద్రన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టి యజమానిని కోల్పోయిన కుటుంబాలకు ధీమా కల్పించే విధంగా సంఘటనను బట్టి ప్రభుత్వం నుంచి ప్రమాద బీమా అందించేలా అవకాశం కల్పించారు. దురదృష్టవశాత్తు ప్రమాదాలకు గురై మృతి చెందిన కుటుంబాలకు రూ.5 లక్షల ప్రభుత్వం అందించి దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి మేమున్నామనే భరోసాను కల్పించేవారు. ఈ నగదుతో కుటుంబానికి ఒక బలం చేకూరేది. ఈ పథకం జిల్లాలో కొన్ని లక్షల కుటుంబాలకు ధీమా కల్పించడంతో అందరి మన్ననల్ని పొందింది.

బీమా మిత్రలే కీలకంగా పథకం అమలు

ఈ పథకాన్ని రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం మండలానికి ఇద్దరి వంతున జిల్లాలో 120 మందికి పైగా బీమా మిత్రలను నియమించి వారి ద్వారా వారికి కేటాయించిన గ్రామాల్లో లబ్ధిదారులకు ఈ పథకం తాలూకు నగదును అందేలా చర్యలు తీసుకున్నారు. వీరంతా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రమాద సమయాల్లో ప్రభుత్వం చేకూర్చిన నగదును లబ్ధిదారులకు అందించేందుకు కీలక పాత్ర పోషించారు. తద్వారా వీరికి ఉపాధి, పేద కుటుంబాలకు ఈ పథకం ధీమా కల్పించింది. కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదం, పాముకాటు, విద్యుదాఘాతం, నీటిలో మునిగి తదితర కారణాలతో మృతి చెందితే వారి కుటుంబాలకు ఈ పథకం దిక్కుగా మారింది. మేమున్నామంటూ ఆనాటి ప్రభుత్వం చీకట్లోకి వెళ్లిపోయిన పేదల కుటుంబాల్లో వెలుగులు నింపింది. అంతకు ముందు ప్రభుత్వాలు కేవలం రూ.30 వేలు మాత్రమే ఇచ్చేవి. కానీ చంద్రబాబు నాయుడు 70 ఏళ్ల లోపు వారు ప్రమాదంలో చనిపోతే రూ.5 లక్షలు, 59 ఏళ్ల లోపు సహజ మరణానికి రూ.2 లక్షలు వంతున అందజేశారు. మృతి చెందిన సమాచారం తెలుసుకున్న బీమా మిత్ర వారి నివాసానికి వెళ్లి మృతుడి కర్మక్రియల ఖర్చులకు ముందుగా రూ.5 వేలు అందజేసేవారు. వారి వివరాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు చేసి మృతుడి మరణ ధ్రువీకరణ పత్రాన్ని సైతం బీమా మిత్రలే సమకూర్చేలా ఏర్పాటు చేసేవారు. ఈ విధంగా ఎన్ని అవాంతరాలొచ్చినా ఈ పథకం లబ్ధిని సాధ్యమైనంత త్వరగా 30 రోజులలోపు లబ్ధిదారులకు అందేలా ప్రతిష్ఠాత్మకంగా అమలు జరిగింది.

నీరుగారిన పథకం

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలవుతన్న చంద్రన్న బీమా పథకం వైసీపీ ప్రభుత్వంలో నీరుగారింది. దీనికి సమగ్రంగా నిధులు కూడా వెచ్చించిన దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులు బీమా మిత్రలను మార్చేసి వైసీపీకి చెందిన వారిని నియమించుకొని వారి ద్వారా పథకం అమలు చేశారు. కానీ పూర్తిస్థాయిలో నగదు అందక లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సచివాలయాల ఏర్పాటు తరువాత సంక్షేమ శాఖ అసిస్టెంట్లు ద్వారా ఈ పథకాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా కూడా టీడీపీలో అందజేసినంత నగదుకంటే తగ్గించి లబ్ధిదారులకు అందజేసేలా పథకాన్ని నీరుగార్చారు. మృతుడి కుటుంబానికి రూ.1 లక్ష మాత్రమే ఇచ్చేలా ప్రణాళిక రూపొందించి ముందుగా రూ.10 వేలు అందజేసేవారు. ఆ తరువాత ఆ నగదు ఎన్ని రోజులకు జమవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇలా ఈ పథకం పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నీరుగార్చేసింది.

పూర్వ పరిస్థితి వస్తుందని..

వైసీపీ హయాంలో నీరుగారిన ఈ పథకం ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పూర్వ పరిస్థితి వస్తుందని ప్రజలు ఎదురు చూస్తు న్నారు. టీడీపీ హయాంలో కుటుంబ యజమానిని కోల్పోయిన ప్పటికీ బీమా ద్వారా వచ్చే నగదుతో ఎంతోమంది వ్యాపారం, పాడి పశువుల పెంపకం, దుస్తుల వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఉండేది. ఆ పరిస్థితి మళ్లీ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


చంద్రన్న బీమా చెక్కు అందజేస్తున్న బీమా మిత్ర (ఫైల్)

లక్షల పేదల కుటుంబాల్లో వెలుగులు నింపింది



గతంలో టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన చంద్రన్న బీమా పథకం దీపాన్ని కోల్పోయి చీకట్లోకి వెళ్లిన లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపింది. వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకమే చీకట్లోకి వెళ్లిపోయింది. మళ్లీ పేదల ప్రభుత్వం రావడంతో పూర్వ పరిస్థితి వస్తుందని భావిస్తున్నాం.

- షేక్ నజీర్ బాషా, అల్లూరు

పేదలకు అండ.. బీమా మిత్రలకు ఉపాధి



చంద్రన్న బీమా పథకం పేదలకుఅండగా, బీమా మిత్రలకు ఉపాధిగా కొనసాగింది. మృతి చెందిన కుటుంబాలను పలకరించేందుకు వెనకడుగు వేసే ఈ రోజుల్లో బీమా మిత్రల సహాయంతో బాధల్లో ఉన్న ప్రతి కుటుంబానికి మేమున్నామంటూ సహాయం అందేది. ఈ సహాయం తామే స్వయంగా ఇస్తున్నట్టు అనుభూతిని పొందిన మాకు గర్వంగా ఉండేది.

- పెండెం మానస, అప్పటి బీమా మిత్ర, నార్తుఆములూరు

బీమా పేద కుటుంబాలకు ధీమానిస్తుంది



చంద్రన్న బీమా పథకం ఆధారం కోల్పోయిన పేదల కుటుంబాలకు ధీమా కల్పించేది. కానీ గత ఐదేళ్లుగా ఈ పథకం నీరుగారిపోయింది. ఈ పథకాన్ని మళ్లీ పునఃపరిశీలించి పూర్వవైభవాన్ని తీసుకువస్తే ఆధారాన్ని కోల్పోయిన పేదల కుటుంబాలకు ఆదరణగా ఉంటుంది.

- గుడిపాటి ప్రసాద్, అల్లూరు

పేదలకు ధీమా కల్పించేలా పునఃప్రారంభించాలి



2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక బీమా పథకం అత్యంత ఆదరణ పొందింది. పేదలకు ధీమా కల్పించేలా ప్రశంసలు పొందిన ఈ పథకం గత ఐదేళ్లుగా మరుగున పడిపోయింది. నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం ఈ పథకానికి పూర్వవైభవాన్ని పునఃప్రారంభించాలి

- రాగాల శీనయ్య, అల్లూరు

మలేరియా నిర్మూలనే లక్ష్యం

- సీజనల్ వ్యాధులు నియంత్రించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వైద్యం) జూన్ 18 : మలేరియా వ్యాధిని 2027వ సంవత్సరం నాటికి నిర్మూలించటమే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, మెదడువాపు మొదలైన వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా కేసుల గుర్తింపు ప్రక్రియను మెరుగుపరచాలని, రాపిడ్ పరీక్షల్లో పాజిటివ్ వస్తే నిర్ధారణ పరీక్షలు తప్పకుండా చేయించాలని దిశానిర్దేశం చేశారు. గుంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా గుంటల్లో గంబూషియా, గుప్పి వంటి చేపలను వదిలి పెట్టాలని ఆదేశించారు. జిల్లా అంతటా ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, పట్టణాలు.. పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, మెప్మా పీడీ రవీంద్ర, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి పరిమళ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

సోమశిలకు 891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, జూన్ 18: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 891 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.960 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

రైల్లో బాల కార్మికుల తరలింపు

- సంరక్షించిన అధికారులు

నెల్లూరు(క్రైం), జూన్ 18: పశ్చిమ బెంగాల్ నుంచి కాట్పాడికి రైలులో తరలిస్తున్న బాల కార్మికులను అధికారులు సంరక్షించారు. కొందరు పిల్లలను బాల కార్మికులుగా రైలులో తరలిస్తున్నట్లు చైల్డ్‌లైన్ ద్వారా వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ ఆర్పీఎఫ్ పోలీసుల సహకారంతో మంగళవారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఆ బాలలను సంరక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు, ఒడిశాకు చెందిని ఇద్దరు బాలలతోపాటు వారిని తరలిస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుఫ్‌డెడ్ సింగా, కాట్పాడికి చెందిన పెరుమాళ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలలకు రోజు వారి కూలి రూ.300 ఇచ్చేలా ఒప్పందం చేసుకుని కాట్పాడిలో సెంట్రింగ్ పనులు చేయించేందుకు తీసుకువెళుతున్నామని నిందితులు తెలిపారు. ఆర్పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా చైల్డ్ అండ్ పోలీస్ హోమ్(క్యాప్)లో చేర్పించారు. పిల్లల తల్లిదండ్రులను పిలిపించి వారికి పిల్లలను అప్పగిస్తామని బాలల సంరక్షణ అధికారి తెలిపారు.

సబ్‌డివిజన్లలోనూ నేర సమీక్ష జరగాలి

- ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 18: సబ్ డివిజన్ అధికారులు వారి పరిధిలోని ఎస్‌హెచ్‌వోలతో నేర సమీక్షలు తప్పకుండా నిర్వహించి గ్రేవ్ కేసుల సంఖ్య తగ్గించాలని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ ఆదేశిం చారు. జిల్లా పోలీసు కార్యాలయం లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంగళవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారు లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈవ్ టీజింగ్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల ప్రారంభ, ముగింపు వేళల్లో, ప్రధానంగా సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్ తప్పకుండా నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, పత్రాలు లేని వాహనాలు, నం బరు ప్లేట్ లేని వాహనాలను నియంత్రించాలన్నారు. ఈ నెల 29వ తేదీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేర నియం త్రణలో భాగంగా బీట్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని, సున్నితమైన ప్రాంతాలు, గతేడాది నేరాల ఆధారంగా బీట్ల పునర్వ్యవస్థీకరణ ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్

జిల్లాకు రూ.33.19కోట్ల పీఎం కిసాన్ నిధులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 18 : రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ పథకం నిధులు రూ.33,19,56,000లు జిల్లాకు విడుదలైనట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం దేశ ప్రధాని మోదీ వారణాసి నుంచి ఆన్‌లైన్ విధానంలో ఈ నిధులు విడుదల చేశారని తెలిపారు. జిల్లాలోని 1,65,978 మంది రైతుల ఖాతాల్లో ఒకటి రెండు రోజుల్లో నిధులు జమ అవుతాయన్నారు.

కోన హుండీ ఆదాయం రూ.86లక్షలు

రాపూరు(డక్కిలి), జూన్ 18: పెంచలకోన లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ హుండీని మంగళవారం ఆలయ ఏసీ సాగర్‌బాబు ఆధ్వర్యంలో లెక్కించా రు. 35రోజులుకు స్వామి వారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలు ద్వారా రూ.86,46,905 ఆదాయం వచ్చినట్లు వివరించారు. అంతే కాకుండా 130 గ్రాములు మిక్సిడ్ బంగారు ఆభరణాలు, 3,700 కిలోలు వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ యుఎస్‌కి చెందినవి 5డాలర్లు, కువైట్ దానార్లను కూడా కానుకల రూపంలో వేసినట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులతో పాటు బ్యాంకు సిబ్బంది ఉన్నారు. హుండీ లెక్కింపు సహాయ కమిషనరు వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో జరిగింది.


పెంచలకోనలో హుండీని లెక్కిస్తున్న అధికారులు

రేపు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18 : విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం లో గురువారం జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు నెల్లూరులోని టౌన్‌హాల్లో జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

సహకార సంఘాల ఆడిట్‌ను నెలాఖరులోగా పూర్తిచేయాలి

- సహకారశాఖాధికారి గురప్ప

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఆడిట్‌ను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని జిల్లా సహకారశాఖాధికారి బీ గురప్ప అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆ సంఘాల ఆడిట్‌పై సమావేశం నిర్వహించారు. ఆడిట్‌కు సంబంధించిన నివేదికలను నిర్దేశిత విధానంలో సమర్పించాలని, పీఏసీఎస్‌లలో సభ్యుల వివరాల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని సూచించారు.

హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించండి

- ప్రజా ప్రతినిధులకు వినతి

నెల్లూరు (విద్య), జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలల్లోని హెచ్‌ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నేతలు మంగళవారం జిల్లాలోని ప్రజా ప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందచేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలసి తమ సమస్యలు విన్నవించారు. ప్రధానంగా కామన్‌రూల్స్‌ను పునరుద్ధరించాలని, పాఠశాల డేటాను పొందుపరిచేందుకు ప్రతి పాఠశాలలో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని కోరారు. పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలకు ప్రతినెలా సక్రమంగా జీతాలు అందేలా చూడాలని, ఉపాధ్యాయులను బోధనేతర విధుల నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు.

బిట్రగుంట రైల్వేని కాపాడండి సారూ..


శంకర్‌రావును సన్మానించిన అభివృద్ధి కమిటీ సభ్యులు

బిట్రగుంట, జూన్ 18: పూర్తి స్థాయిలో వసతులు, పుష్కలంగా వనరులు ఉన్న బిట్రగుంట రైల్వేని ఇక్కడి నుంచి తరలించకుండా కాపాడాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బిట్రగుంట, గూడూరు సెక్షన్ పరిధిలోని రైల్వే ఎంప్లాయీస్ మజ్దూర్ యూనియన్ సమావేశం మంగళవారం బిట్రగుంటలో జరిగింది. ఈ సమావేశానికి ఆల్ ఇండియా మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సీహెచ్ శంకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్.నూరుద్దీన్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణస్‌రాజు, విశాంత రైల్వే ఉద్యోగి భాగ్యరాజ్‌లు ఆయనకు వినతిపత్రం అందచేశారు. బిట్రగుంట రైల్వే స్టేషన్ బోగోలు మండల ప్రజలకు కాకుండా అల్లూరు, దగదర్తి మండలాల ప్రజలు, వేల మంది విశ్రాంత రైల్వే ఉద్యోగులకు ఎంతో అనుకూలంగా ఉందని, ఇది వరకు ఇక్కడ ఆగుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లను కుంటి సాకులతో శాస్వతంగా స్టాపింగ్ ఎత్తివేశారని, రిజర్వేషన్ కౌంటర్ ప్రైవేట్ పరం చేశారని ఆయన దృష్టికి తెచ్చారు. సానుకూలంగా స్పందించిన శంకరరావు యూనియన్ సభ్యులతో మాట్లాడిన తరువాత రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోతానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాజారత్నం, వేణుమునుస్వామి, రవిచంద్ర, ఆరోగ్యరాజ్, జహీర్ ఉన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- ఆరుగురి అరెస్ట్
- రూ.31వేలు స్వాధీనం

నెల్లూరు(క్రైం): గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లమధ్య నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం నెల్లూరు నగర డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది దాడులు చేశారు. ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి, రూ.31,620 నగదు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు శివార్లలోని అక్క చెరువుపాడులో పేకాటస్థావరం నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న నగర డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది ఆ స్థావరంపై దాడి చేశారు. ఎస్ సంజీవ నాయుడు, కే ప్రభాకర్, కే జనార్ధన్, పీ శ్రీనివాసులు, వీ అనిల్, డీ మోహన్‌రా వును అరెస్ట్ చేసి వారి నుంచి రూ.31,620 నగదును స్వాధీనం చేసుకున్నారు.. పేకాట కేంద్రాన్ని డీఎస్పీ డీ శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. దాడుల్లో ఐడీ పార్టీ ఏఎస్‌ఐ మణి, హెడ్‌కానిస్టేబుల్ సాగర్, కానిస్టేబుళ్లు గురవారెడ్డి, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

చందనాలంకరణలో మాతాపరమేశ్వరి, సంతానలక్ష్మి

సంగం, జూన్ 18: స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన మాతాపరమేశ్వరి మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన సంతానలక్ష్మి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చార. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎల్‌వీ.ప్రసాద్‌శర్మ వేకుజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదాతలుగా అయితా సుబ్బారావు, వెంకటలక్ష్మి కుమారి దంపతులు వ్యవహరించారు. బుధవారం పసుపు, కుంకు, ప్రధానోత్స వం, సంతానం లేనివారు వరుపడుట, అమ్మవారి గ్రామోత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


సంగం: మాతాపరమేశ్వరిదేవి


ఉదయగిరిలో సంతానలక్ష్మి



హంస వాహనంపై ఆత్మారామస్వామి

సంగం, జూన్ 18: అన్నారెడ్డిపాళెంలో వెలసిన ఆత్మారామస్వామి మంగళవారం తెల్లవారుజామున హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామిని హంస వాహనంపై ఉంచి గజమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

సంగమేశ్వరుడి లక్ష మల్లెలార్చన

సంగం: శుక్ల ద్వాదశి సందర్భంగా స్థానిక సంగమేశ్వరాలయంలో మంగళవారం రాత్రి కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామికి భక్తులు లక్ష మల్లెలార్చన నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు, గ్రామ పెద్దలతో పాటు ఆలయ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.


లక్ష మల్లెలార్చన నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

కనుల పండువగా అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం

ఉదయగిరి, జూన్ 18: గన్నేపల్లి పంచాయతీలోని అడవిపేరంటాలమ్మకు మంగళవారం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పేరంటా లమ్మ పుట్టినిల్లయిన గడ్డంవారిపల్లి నుంచి హక్కుదారులు పొలాయిలను ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో అలంకరించి మిట్టపల్లె, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, అడవిపేరంటాలమ్మ నగర్ మీదుగా గ్రామోత్సవం సాగింది. మహిళలు వారు కడవతో అమ్మవారిని స్వాగతించి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన డప్పు వాయిద్యాలు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నర్రవాడను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే కాకర్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌బాబు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 18: జిల్లా ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్రవాడ పర్యాటక కేంద్రంగా మారితే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు జరిగే వెం గమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. చివరి రెండురోజుల్లో భక్తులు అధికసంఖ్యలో తరలి రానుండడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. గ్రామోత్సవాలు, క్యాలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కాకర్లను పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ తుమ్మల సురేష్‌బాబు మాజీ చైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆల య కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, సీఐ వేల్పుల గిరిబాబు పాల్గొన్నారు.

వింజమూరు: బొమ్మరాజు చెరువు గ్రామం వద్ద ఉన్న తెలుగుదేశం కార్యాలయంలో మంగళవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. నియోకవర్గంలో ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను చేరేలా చూస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన అనేక పథకాలను ప్రజలందరికీ అందే విధంగా చూస్తానని తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కాకర్ల చేతుల మీదుగా ఉదయగిరి బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు ఆధ్వర్యంలో ఎన్డీఏ విజయానికి చిహ్నంగా ఉసిరిమొక్కను నాటారు. కార్యక్రమంలో కాకర్ల సునీల్, కాకర్ల వెంకట్, మాలేపాటి మల్లికార్జున్‌నాయుడు, హనుమారెడ్డి, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రి, శరత్‌బాబు, రమణయ్య, సాయికుమార్, దుర్గయ్య, శ్రీహరి, రాజేష్‌నాయుడు, శ్రీనివాసులు, నరేంద్ర, నాగేంద్ర, వెంకటాద్రి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల బడిబాట


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంగం, జూన్ 18: స్థానిక మిక్సిడ్‌కాలనీలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్ల పైబడి ఐదేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రం లో చేర్పాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ బాట- పిల్లలకు బంగారు బాట అనే ఫ్లెక్సీ చేతపట్టుకుని నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, జూన్ 18: ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పనిచేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరు, పేరారెడ్డిపల్లి, వాశిలి, కరటంపాడు, మురగళ్ల, బట్టేపా డు కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117జీవో ను రద్దు చేసి, 3,4,5 తరగతులను మరలా వెనక్కు పంపాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిషు మీడియంలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ రామసుబ్బారెడ్డి, ఏ వెంగయ్య, షేక్ సాజిద్, బి దయాకర్ పాల్గొన్నారు.


సభ్యత్వ రశీదును అందజేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

కొత్తరకం సజ్జ విత్తనాల పంపిణీ

సీతారామపురం, జూన్ 18: అయ్యవారిపల్లి రైతుభరోసా కేంద్రంలో మంగళవారం నెల్లూరు జిల్లా ఆత్మ డీపీడీ శివనారాయణ రైతులకు ఏబీవీ 04 రకం సజ్జ విత్తనాల మినీకిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లాలో విజయవంతమైన ఈ రకంను మొదటగా మన జిల్లాలోని అయ్యవారిపల్లి రైతులకు ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం సజ్జ యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోడి విడుదల చేసిన పీఎం కిసాన్ 17 విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కూర్చొని వీక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుగ్గయ్య, నారాయణ, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు శ్వేత, గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివనారాయణ

పీఎం కిసాన్ నిధుల విడుదలపై అవగాహన

ఆత్మకూరు, జూన్ 18: పట్టణంలోని వ్యవసాయం కార్యాలయంలో శ్రీదేవి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో రైతులకు పీఎం కిసాన్ నగదు విడుదల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారణాసిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని టీడీపీ, బీజేపీ నాయకులు, రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, మద్రాస్ ఫర్టిలైజర్ రీజనల్ మేనేజర్ ఆది నారాయణస్వామి, తుమ్మల చంద్రారెడ్డి పాల్గొన్నారు.


ఎల్ఈడీ ద్వారా వీక్షిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు, రైతులు

అనంతసాగరం: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ 17వ విడత నిధుల విడుదలపై ఏవో శ్రీధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. 25 గ్రామ పంచాయతీల్లో 7,110 మంది రైతులకు రూ.1.42 కోట్లు వారి ఖాతాల్లో జమ కానున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని టెలివిజన్ ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు.

సదరం సర్టిఫికెట్ల పంపిణీ

ఉదయగిరి, జూన్ 18: స్థానిక విద్యావనరుల కేంద్రంలో విద్యార్థులకు సదరన్ సర్టిఫికెట్లను మంగళవారం ఎంఈవో మస్తాన్‌వలి పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ చూపి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పథకాలు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు సుభాస్‌చంద్రబోస్, శివనందిని పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

ఉదయగిరి రూరల్, జూన్ 18: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈవీఎంల పనితీరుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించామని ప్రగల్భాలు పలికిన జగన్ అప్పట్లో ఈవీఎంలు కనపడలేదా అని ప్రశ్నించారు. జగన్ అరాచక పాలనకు ప్రజలు బుద్ధిచెప్పి రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబునాయుడు కావాలనే కసితో ప్రజలు ఓట్లేసి 164 సీట్లు గెలిపిస్తే ఈవీఎంలు సక్రమంగా పనిచేయలేదని జగన్ పనికిమాలిన మాటలు మాట్లాడడం ఆయన రాజకీయ పతనానికి నాంది అన్నారు. భవిష్యత్తులో వైసీపీ, జగన్‌కు పుట్టగతులుండవన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు మాత్రమే ముఖ్యమంత్రిగా సమర్థుడని ప్రజలు గుర్తించి ఆయనకు బ్రహ్మరథం పట్టారన్నారు.

కనువిందుగా మే పుష్పం..

ఉదయగిరి, జూన్ 18: రక్త కలువుగా పిలువబడే మే పుష్పం పట్టణంలోని యూనియన్ రోడ్డుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటి పెరట్లో పూసింది. ప్రతి ఏడాది మేలోనే ఇది పూస్తుందని, ఈ ఏడాది ఎండల తీవ్రతలతో జూన్‌లో వికసించిందని ఆయన చెప్పాడు. పుష్పాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పేరుకే పట్టణం.. పల్లెల కన్నా అధ్వానం!

● కావలి శివారులో మౌలిక వసతుల కరువు


అధ్వానంగా ఉన్న ముసునూరు మల్లారెడ్డి తోట వీధి

కావలిటౌన్, జూన్ 18: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక వీధులన్నీ పల్లెటూర్లకంటే పరమ అధ్వానంగా ఉన్నాయి. గతంలో పంచాయతీలుగా ఉన్న ముసునూరు, మద్దూరుపాడు, బుడంగుంట గ్రామాలు 2011లో కావలి మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. పంచాయతీలు పట్టణంలో చేని 14ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ మౌలిక వసతులకు నోచుకోలేదు. పలుప్రాంతాల్లో తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు లేవు. ఏవీధిలో చూసినా మురుగునీరు నిల్వచేరి రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. శివారు ప్రాంతాలు కావడటంతో ఎక్కడ చూసినా చిల్లచెట్లు, మట్టిరోడ్లు, పేడ దిబ్బలు, మురుగు దర్శనమిస్తున్నాయి.

● **పాలకుల నిర్లక్ష్యం**

సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగు నీటి వసతి కల్పనలో పాలకులు, అధికారులు శ్రద్ధ చూపకుండా నిర్లక్షం వహిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో పేదలకు కేటాయించిన ఇందిరమ్మ గృహాల మెగా కాలనీలను ముసునూరులో నిర్మించారు. ఇందిరమ్మ కాలనీలు ఏర్పడి 20 ఏళ్ల గడిచి నా ఇప్పటికీ మౌలిక వసతులు లేవు. అక్కడి ప్రజల కష్టాలు వర్ణణాతీతం. తాగునీటికి మినరల్ వాటర్ బబుల్స్ కొనుగోలు చేయాల్సిందే. వాడుకునే నీటికి మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌లే దిక్కు. కాగా పట్టణంలో విలీనమైన శివారు ప్రాంతాలను మున్సిపాలిటీ వారు విస్మరించారు. చెత్తతీయక, వీధు లు శుభ్రం చేయక , కాలువలు లేక, పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

పన్నులు పెరిగాయి తప్ప అభివృద్ధి ఏది ?

తమ ప్రాంతాలు పంచాయతీలుగా ఉన్నప్పుడే బావుండేవి. పట్టణంలో విలీనమైనప్పటికీ మౌలిక వసతుల కల్పన లేదు. ఇప్పటికీ పల్లెటూర్లగానే ఉన్నాయి. అభివృద్ధి మాట ఏమోగాని పట్టణం పేరుతో పన్నులు పెరిగాయే తప్ప జరిగిన అభివృద్ధి శూన్యం.

\- ఆర్ వెంకటేశ్వర్లు, ముసునూరు

ఇంటూరిని కలిసిన టీడీపీ శ్రేణులు

కందుకూరు, జూన్ 18: కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు ఘన విజయం సాధించటంతో కందుకూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకున్న తెలుగుదేశం పార్టీ యువనేతలు, కార్యకర్తలు మంగళవారం తిరిగివచ్చిన సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావును కలిసి ప్రసాదాలు అందించి సత్కరించారు. యువనాయకుడు అబ్బూరి వేణు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరుమలకు పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. వారు 236 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్రలో అనుభవాలను అడిగి తెలుసుకున్న నాగేశ్వరరావు వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అబ్బూరి చందు, మధిర బ్రహ్మారూప్, పత్తిపాటి పవన్, వేములూరి సాయి, వేములూరి బ్రహ్మం, వెంకట్, రమణయ్య, సంపత్, శ్రీను, ప్రకాష్, వెంగబాబు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరిని కలిసిన న్యాయవాదులు

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మంగళవారం పలువురు న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా న్యాయవిభాగం అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, బట్టరుశెట్టి సాయిశంకర్, షేక్ షంషుద్దీన్ తదితరులు నాగేశ్వరరావును సత్కరించి అభినందనలు తెలిపారు.


ఇంటూరి నాగేశ్వరరావును సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి

● ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 18: ప్రభుత్వ గురుకుల, మోడల్ పాఠశాలల్లో, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ గురుకుల, మోడల్‌స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల వార్డెన్లు, సిబ్బంది మంగళవారం సాయంత్రం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వసతిగృహాలలో చేరే విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించటంలోను రాజీ పడవద్దన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


కావలి ఎమ్మెల్యేను కలిసిన ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కందుకూరు, జూన్ 18: మండలానికి 251 క్వింటాళ్ల జనుము, 34 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. మండలంలోని ఓగూరు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏడీఏ పీ.అనసూయ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్ నగదు 2 వేలు రైతుల ఖాతాలకు బదిలీచేశారిని, జమకాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ అధికారిణి ధనమ్మ మాట్లాడుతూ 21 రకాల విత్తనాల కిట్ పొలంలో వేసుకుని 40 రోజుల తర్వాత దున్నుకుంటే భూమికి మంచి పోషకాలు అంది మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అల్లం రాధయ్య చేతులమీదుగా 21రకాల విత్తనాల కిట్‌లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు కె. శరత్‌కుమార్, పశుసంవర్ధక సహాయకులు షేక్ షాజహాన్, పిడికిటి మాధవ, చల్లా రాజా తదితరులు పాల్గొన్నారు.


విత్తనాల కిట్లు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

కావలిటౌన్, జూన్ 18: విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు కృషి చేయాలని కావలి ఎంఈవో-1 గోవిందు కోరారు. మంగళవారం పట్టణ, రూరల్ మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి ప్రధానంగా విద్యార్థుల నమోదు, హాజరుశాతం వివరాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిధిలోని విద్యార్థుల వివరాలు ఎంతమంది బడికి వస్తున్నారు.. ఎంతమంది బడికి దూరంగా ఉన్నారు గుర్తించి బడికి దూరంగా ఉన్న పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకొని వారు బడికొచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోపణలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు.

రక్తదాన ఆవశ్యకతను చాటండి

కావలిటౌన్, జూన్ 18: రక్తదానం ఆవశ్యతను చాటాలని విశ్రాంత ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రవి నర్సింగ్ హోమ్ సమావేశ మందిరంలో ఐఎంఏ, రెడ్‌క్రాస్, జేవీవీ, యుటీఎఫ్‌ల ఆధ్వర్యంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన రక్తదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ జూలై 1న డాక్టర్స్ డేని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ రక్తనిధిలో తలపెట్టిన రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్లు బెజవాడ రవికుమార్, నళినిపద్మ, రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, యుటీఎఫ్ జిల్లా నాయకులు మాధవ, రోటరీ అధ్యక్షురాలు స్వర్ణలత, హరినారపరెడ్డి, దిలీప్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జాపై విచారణ జరిపించాలి

కావలి, జూన్ 18: ప్రభుత్వ భూములు ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారిపై, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా గ్రావెల్ తరలించి రియల్‌ఎస్టేట్‌కు వాడుకున్నవారిపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపి కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం,నూనె వీనయ్య, పీ శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి మహలక్ష్మమ్మ ఉత్సవాలు

కలిగిరి, జూన్ 18: కలిగిరి పట్టణంలోని పాతూరు ప్రాంతంలో వెలసి ఉన్న మహలక్ష్మమ్మ ఉత్సవాలు బుధవారం నుంచి రెండు రోజులపాటు వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 19న ఉదయం 9గంటలకు గణాధిపూజా కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం పుణ్యాహవాచనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నదాన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20వ తేదీ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

బిట్రగుంట, జూన్ 18: గ్రామ పంచాయతీ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు వెంకటరత్నం హెచ్చరించారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మంఘళవారం గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసి పోయాయని, ఇకపై ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని 16 పంచాయతీల్లో అక్రమ లేఔట్ల వివరాలు వెంటనే సేకరించాలన్నారు. ప్రభుత్వ, చెరువు భూముల అక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందచేయాలన్నారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు సెలవు పెట్టి వెళ్లిపోవచ్చన్నారు. అత్యవసరం తప్ప ఫోన్ మెసేజ్ ద్వారా సెలవులు కోరడం సరికాదని, రాత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమీఉల్లా, డిప్యూటీ తహసీల్దారు జూలియా భాయ్, ఏవో గోవిందు, పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో కార్పొరేషన్ల నిర్వీర్యం

అల్లూరు, జూన్ 18 : గత ప్రభుత్వంలో కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నోర్లు కొట్టారని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన అంబేడ్కర్ యువజన సంఘం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో, కాంగ్రెస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎంతో అభివృద్ధి చెందేందుకు అవకాశాలను కల్పించారని, వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరిని పాతాళానికి తొక్కేశారన్నారు. ఎస్సీలకు చెందవలసిన 27 పథకాలను రద్దుచేసి నోటి దగ్గరి కూడుని లాక్కున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కోవూరు బాబు, ఎం నరేంద్ర, నక్కా గిరి పాల్గొన్నారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి

కందుకూరు, జూన్ 18: మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఏకాగ్రత, సకల జీవులతో మిత్రత్వం, వృద్ధాప్య ఛాయల నిరోధకత తదితర ఎన్నో ప్రయోజనాలు ధ్యానం ద్వారా లభిస్తాయని పిరమిడ్ ఆధ్యులు, మాస్టరు టీఎస్ రామమూర్తి పేర్కొన్నారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ధ్యానం తరగతులు నిర్వహించారు. ధ్యాన పద్ధతులపై అవగాహన కల్పించారు.

నర్సింగ్ కాలేజీలో మొక్కలు నాటిన విద్యార్థినులు

జలదంకి, జూన్ 18: మండలంలోని జమ్మలపాలెంలోని శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ ఆవరణలో యాజమాన్యం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. నర్సింగ్ విద్యార్థినులు రకరకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి, నర్సింగ్ కోర్సు శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో కొనసాగుతున్న సర్వే

కావలి, జూన్ 18: కావలి పట్టణంలో అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మూడవ రోజైన మంగళవారం కూడా రోవర్‌తో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పట్టణప్రణాళికాధికారి బాబూరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు సర్వే చేపట్టారు. వెంగాయగారిపాలెం ప్రాంతంలో వేసిన లేఅవుట్‌లను సర్వే చేసి అందులో ఉన్న ప్రభుత్వ పంట కాలువలను గుర్తించి మార్కింగ్ చేశారు. అక్కడ లేఅవుట్‌లో కట్టిన ప్రహరీ గోడ కొంత బాగం ప్రభుత్వ కాలువ మార్కింగ్ పరిధిలోకి రావడంతో అక్కడ గోడకు మార్కింగ్ చేశారు. గోడ కట్టిన వారికి నోటీస్ ఇచ్చి దానిని తొలగించకపోతే అధికారులే తొలగించనున్నట్లు చెప్పారు.


రోవర్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్, తదితరులు


కాలువ స్థలంలోకి వచ్చిన లేఅవుట్ ప్రహరీ

నేటి నుంచి సర్వే ముమ్మరం : అక్రమ లేఅవుట్లలో బుధవారం నుంచి సర్వే ముమ్మరం చేసేందుకు టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోవర్లతో ఐదు టీమ్‌లతో అన్ని లేఅవుట్‌లలో ప్రభుత్వ స్థలం గుర్తించే విధంగా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. దీంతో అక్రమ లేఅవుట్‌లు వేసిన వారు వాటిల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.

'ప్రైవేటు'లో ఫీజుల మోత!

- అమలు కాని నియంత్రణ
- పట్టించుకోని విద్యాశాఖాధికారులు
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

కోవూరు, జూన్ 18: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు భారీ మొత్తంలో ఫీజులు పెంచి వసూలు చేస్తుండటంతో పేద కుటుంబాలు తల్లడిల్లపోతున్నాయి. కోవూరు మండలంలో 15, బుచ్చిరెడ్డిపాళెంలో 20, కొడవలూరులో 3, విడవలూరులో 4, ఇందుకూరుపేట మండలంలో 5 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఫీజులు వసూలు చేయాల్సి ఉండగా ఏ పాఠశాలలోనూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వసూలు చేసిన ఫీజుల వివరాల్ని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అధికారులు ఎక్కడా ప్రచారం చేయడం లేదు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.10,000 ఫీజు వసూలు చేయాల్సి ఉండగా రూ.22,000 నుంచి రూ.25,000 వరకు వసూలు చేస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.12,000 వసూలు చేయాల్సి ఉండగా రూ.30,000 నుంచి రూ.40,000 వసూలు చేస్తున్నారు. ఫీజుల వసూళ్లు అన్ని పాఠశాలల్లోనూ రహస్యంగానే జరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు తమ పాఠశాలలో ఫీజు వసూళ్ల వివరాలపై నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఒక్కచోట కూడా బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. పుస్తకాల సరఫరాకు కూడా భారీ మొత్తంలో నగదు వసూళు చేస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో విధిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలని పలువురు డిమాండు చేస్తున్నారు.



ఫీజుల వివరాల బోర్డులెక్కడ?

ఫీజుల వసూళ్లపై మండల విద్యాశాఖాధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా అదనపు ఫీజు వసూళ్ల విషయం తెలిసి నప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. పాఠశాలల్లో ఫీజుల వివరాల బోర్డులు ఏర్పాటు చేయకపోయినప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ఎంఈవో కార్యాలయంలో సైతం బోర్డు ఏర్పాటు చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలల్ని నామమాత్రంగా తనిఖీ చేసి ప్రైవేటు పాఠశాలల కొనసాగింపునకు అనుమతి మంజూరు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆఫీసుకు వస్తే వివరాలు చెబుతాం

ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల్ని అమలు పరుస్తున్నాం. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఉన్నందు వల్ల ఫీజుల వివరాలు అందరికీ చెప్పలేకపోతున్నాం. ప్రైవేటు పాఠశాలల్లో వసూలు చేయాల్సిన ఫీజులు వివరాల్ని ఎవరైనా తల్లిదండ్రులు ఆఫీసుకు వస్తే చెబుతాం.

- రహీమ్, ఎంఈవో, కోవూరు

రైతులకు నీటి డ్రమ్ములు, టార్పాలిన్ల పంపిణీ

పొదలకూరు, జూన్ 18: ప్రభగిరిపట్నం, అమ్మవారిపాలెంలోని 30మంది ఎస్సీ, ఎస్టీ పైద రైతులకు మంగళవారం విత్తనాలు, నీటి డ్రమ్ములు, టార్పాలిన్లు రూ.10వేలు విలువ చేసే వ్యవసాయ సామగ్రిని వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాముడూరు రవీంద్రబాబు, బొమ్ము పెంచలయ్య, వడిదారి నరసయ్య, మాముడూరు సులోచన, కత్తి సుబ్బమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో వాగ్వాదం

- కావలిలోకి వెళ్లదన్నందుకు ప్రయాణికుల నిరసన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 18: ఆర్టీసీ బస్సు ఎక్కించుకోలేదని నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ప్రయాణికులు నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... సూళ్లూరుపేట నుంచి విజయవాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సును మంగళవారం ఆత్మకూరు బస్టాండు లోపలికి వెళ్లకుండా బయట నిలిపారు. కొందరు ప్రయాణికులు కావలికి వెళ్లేందుకు ఆ బస్సు ఎక్కారు. అయితే బస్సు కావలి బస్టాండుకు వెళ్లదని, బైపాస్‌లో వెళ్లిపోతుందని బస్సు దిగాలని కండెక్టర్ ప్రయాణికులకు తెలిపారు. ఈ విషయంలో ప్రయాణికులకు, కండక్టర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ప్రయాణికులు బస్సు ముందు నిల్చొని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులకు నచ్చజెప్పి బస్టాండులో కావలికి వెళ్లే బస్సును ఎక్కించి పంపడంతో గొడవ సద్దుమణిగింది.

పీఎం కిసాన్ నిధులు విడుదల హర్షణీయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 18: కేంద్రంలో మూడోసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ రైతులకు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి విడుదల చేయడం హర్షణీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం బీవీనగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, అధికారులతో కలిసి బీజేపీ నాయకులు వీక్షించారు. సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 92 వేల మంది రైతులకు రూ.20 వేల కోట్లు విడుదల చేశారన్నారు. దేశానికి వెన్నెముక అయిన రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగినేని ప్రసాద్ చౌదరి, జిల్లా కిసాన్ సంఘ్ నాయకుడు రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ సీఎం' ప్రారంభించండి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 : అత్యంత వేగంగా ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు డయల్ యువర్ సీఎం కార్యక్రమాన్ని ప్రారంభించాలని భారత సేవా ఫౌండేషన్ కార్యదర్శి, గుర్రం జాషువా గ్రంథాలయం అధ్యక్షుడు ఎస్‌కే ఖాసిం, భారత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కే రాజశిఖామణి ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా, మండల స్థాయిలో అధికారులకు చేసిన ప్రజా విజ్ఞప్తులు బుట్టదాఖలు అవుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలను సామాన్యుడు సైతం సీఎం దృష్టికి తీసుకువెళ్లే స్థాయికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాల్లో పర్యటనలు చేసే సమయంలో ప్రజలు వారి సమస్యలు విన్న వించేందుకు ప్రజా దర్బార్‌లాంటి కార్యక్రమాలు కూడా నిర్వహిం చాలని విజ్ఞప్తి చేశారు.

దేవదాయ శాఖ మంత్రి ఆనంకు అభినందన

ఇందుకూరుపేట, జూన్ 18 : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో మంగళవారం జిల్లా బీజేపీ నాయకుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, మారుబోయిన శ్రీనివాస్‌గౌడ్, గోళ్ల మోహన్‌కృష్ణ, అవ్వారు ఏడుకొండలుపాల్గొన్నారు.

కనులపండువగా అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం

ఉదయగిరి, జూన్ 18: గన్నేపల్లి పంచాయతీలోని అడవిపేరంటాలమ్మకు మంగళవారం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పేరంటా లమ్మ పుట్టినిల్లయిన గడ్డంవారిపల్లి నుంచి హక్కుదారులు పొలాయిలను ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వా హనంలో అలంకరించి మిట్టపల్లె, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, అడవిపే రంటాలమ్మ నగర్ మీదుగా గ్రామోత్సవం సాగింది. మహిళలు వారు కడవతో అమ్మవారిని స్వాగతించి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సర్వీసు రోడ్లను ఉపయోగించని ఆర్టీసీ

- పెరుగుతున్న ప్రమాదాలు

వెంకటాచలం, జూన్ 18: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల సంస్థ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాలకు సర్వీసు రోడ్లు, పక్కనే బస్సు షెల్టర్లను కూడా ఏర్పాటు చేశారు. గతంలో కంటే రోడ్లు బాగుండడం, వాహనాల రద్దీ పెరగడంతో బస్సులను మెయిన్ రోడ్డులో ఆపితే ప్రమాదాలు జరుగుతాయనే ఉద్దేశ్యంతో ఈ సర్వీసు రోడ్లను ఏర్పాటు చేశారు. ఈ రోడ్లను ఆర్టీసీ బస్సులు వినియోగించక పోవడంతో రహదారి వెంట తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికులను దించేందుకు బస్సులను ఆర్టీసీ సిబ్బంది మెయిన్ రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. ఈ సమస్యతో వెనుకవైపు నుండి వచ్చే వాహనాలు బస్సులను ఢీకొడుతున్నాయి. బస్సు దిగిన వారు బస్సు ముందు నుండి రహదారిని దాటే యత్నం చేస్తూ ఎంతో మంది తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారు. గతంలో అనేకమార్లు వెంకటాచలంలో ఇదే తరహాలో కొంతమంది ప్రమాదాల బారిన పడ్డారు. కసుమూరు రోడ్డు, సర్వేపల్లి రోడ్డు కూడళ్లలో ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో కసుమూరు రోడ్డు సెంటరులో ఆర్టీసీ బస్సు మెయిన్ రోడ్డుపై ఆగిన సమయంలో వెనుకవైపు నుండి వచ్చి పలు వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఎన్నో చోటుచేసుకున్నాయి. అదే విధంగా కసుమూరు రోడ్డు కూడలిలో బస్సు నుండి ప్రయాణికులు దిగే సమయంలోనూ బస్సును వెనుక వైపు నుండి వచ్చిన పలు వాహనలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ప్రయాణికులు గాయపడగా.. మరికొందరు మృత్యువాత పడ్డారు. బస్సులను సర్వీసు రోడ్లలో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై జాతీయ రహదారుల అధికారులు, పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని చెబుతున్నారు.



కసుమూరు రోడ్డు కూడలిలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న బస్సు

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా ?

- గుంతలమయంగా బస్టాండ్ సెంటర్

సైదాపురం, జూన్ 18: మండలకేంద్రం నుంచి నిత్యం గూడూరు, పొదలకూరు, రాపూరు మండలాలకు వాహన రాకపోకలు కొనసాగుతుంటాయి. వర్షాకాలం కావడంతో బస్టాండ్ సెంటర్ రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు చిత్తడవుతోంది. ఈ సమస్యతో దుకాణదారులు, ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



బస్టాండ్ సెంటర్‌లోని రోడ్డు దుస్థితి

బుచ్చి నగర పంచాయతీలో కనీస వసతులు కరవు

- తాగునీటి కోసం ప్రజల అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 18: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ప్రధానంగా కట్టుబడిపాళెం, బుచ్చి పెద్దూరులోని ప్రభుత్వ లేఔట్లు, తదితర ప్రాంతాల్లో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీరు, డ్రైన్లు, వీధిలైట్లు తదితర సదుపాయాలు లేవని గ్రామస్థులు వాపోతున్నారు. బుచ్చి పెద్దూరులోని 2వ లేఔటు, కట్టుబడిపాళెంలోని 2,3,4 లేఔట్లు, నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తాగునీరు లేక దాహార్తితో అలమటిస్తున్నామని, బోర్లు వున్న వారి దయతో దాహార్తి తీర్చుకుంటున్నామంటూ ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ లేఔట్లలో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టిన కొంత కాలానికి తూతూ మంత్రంగా అల్లూరు కాలువలో నుంచి పైపులైన్లు, సింటెక్స్ వాటర్ ట్యాంకుల ఏర్పాటుతో తాగునీరు అందించామనిపించారు. కాగా, లేఔట్లలో సుమారు 20శాతం మంది ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకుని కాపురాలు ఉంటున్నవారు కనీస మౌలిక సదుపాయాలు లేక నానా అవస్థలు పడుతుండగా నిర్మాణాలు పూర్తిచేసుకుని చేరేందుకు సిద్ధంగా వున్న వారు మౌలిక సదుపాయాల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, ప్రభుత్వ లేఔట్లలో తాగునీటి సరఫరా కోసం బోర్లు, పైపు లైన్లు ఏర్పాటు బాధ్యత పబ్లిక్ హెల్త్‌కు అప్పగించింది. అయితే ఆ పబ్లిక్ హెల్త్ అధికారులు ఎవరో కూడా తెలియదనీ, స్థానిక అధికారులను అడిగితే తమకూ తెలీదని చేతులెత్తేస్తుండడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఆదిలో లేఔట్లలోని వీధుల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారి దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయంపై నగర పంచయతీ కమిషనర్ రమణబాబును వివరణ కోరగా... తాత్కాలికంగా వాటర్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. సమస్యలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు.



వీధుల్లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 : నగరంలోని మాగుంట లే అవుట్‌లో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం రాత్రి అంకురార్పణ, 20వతేదీ రాత్రి శేషవాహన సేవ, 21వతేదీ హనుమంత వాహనం, 22న గరుడ వాహన సేవ, 23వతేదీ గజవాహన ఉత్సవం, 24వతేదీ అశ్వవాహన సేవ జరుగుతాయని తెలిపారు. 25వతేదీ సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు, పవళింపు సేవ జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

కూటమి శ్రేణుల కృషితోనే విజయం

కోవూరు నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18 : టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఫలితంగా తాము ఎంపీ, ఎమ్మెల్యేగా గెలవగలిగామని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు అన్నారు. మంగళవారం నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో కోవూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమను గెలిపించిన వారి రుణం తప్పకుండా తీర్చుకుంటామన్నారు. తమ విజయం కార్యకర్తలకు, ప్రజలకు అంకితమన్నారు. ఎన్నికల సందర్భంగా తాను చేసిన వాగ్దానాలు ఎలా నెరవేర్చాలా అని నిరంతరం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. కార్యదక్షత కలిగిన వ్యక్తులకు చంద్రబాబు నాయుడు మంత్రి పదవులు కట్టబెట్టడం నెల్లూరు జిల్లా వాసులు చేసుకున్న అదృష్టంగా వేమిరెడ్డి అభివర్ణిం చారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఇఫ్కో కిసాన్ సెజ్, కేంద్ర రక్షణశాఖకు సంబంధించిన మిధానీ ప్రాజెక్టును సాధించి కోవూరు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వయసులో చిన్నవాడైనా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పరిణితి చెందిన నాయకుడని, ఆయనకు తనకు బిడ్డలాంటోడన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మండే ఎండల్లో కార్యకర్తలు పడ్డ కష్టం తనకు తెలుసని, తన విజయం కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన కోవూరు ఇన్‌చార్జి హరిరెడ్డి తదితరులు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి దంపతులు, నాయకులు

విజయాభినందనలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఎంపీగా, కోవూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, ఆయన సతీమణి విజయలక్ష్మి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మం గుప్తా దంపతులు కూడా పాల్గొన్నారు.

ఆనంను కలిసిన అర్చక సమాఖ్య నేతలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 : రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు. నెల్లూరులోని ఆయన నివాసంలో మంగళవారం జిల్లా అర్చక సమాఖ్య నాయకులు మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్‌తో కలిసి మంత్రిని సత్కరించి వేద ఆశీర్వచనం అందజేశారు. అర్చకుల సమస్యలు నివేదించడమేకాక సంస్కృత భాష అభివృద్ధికి వేద పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ప్రసాదాచార్యులు, ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు, ఉపకార్య దర్శి ఫణిశర్మ, శ్రీశైలం శ్రీధర్ పాల్గొన్నారు.



మంత్రి ఆనంను సత్కరిస్తున్న అర్చకులు

- మంత్రి రామనారాయణరెడ్డిని ఆర్యవైశ్య నేతలు జీడిపప్పు, బాదంపప్పు మాలతో సత్కరించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, అర్బన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎంపీ ఆంజనేయులు, భావనాశి సురేష్, పీవీ శేషారావు, వడమాల రమేష్ పాల్గొన్నారు.

'సోమశిల' రక్షణ పనులు చేయించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సోమశిల జలాశయం రక్షణ పనులు వెంటనే చేయించాలని మంత్రి రామనారాయణ రెడ్డిని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మూడేళ్ల క్రితం సంభవించిన వరదలకు సోమశిల ముందు భాగం దెబ్బతిన్నదని, ఆ పనులను పూర్తి చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేర్నాటి రంగారెడ్డి, నరాల సుబ్బారెడ్డి, పాదర్తి కోటారెడ్డి, పీ దుష్యంత్‌రెడ్డి, ముని సురేష్, తమటం సుబ్బారెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యలపై కలిసి పనిచేస్తాం

- సీపీఎం నేతలతో ఎమ్మెల్యే కోటంరెడ్డి సమావేశం

నెల్లూరు (వైద్యం), జూన్ 18 : ప్రజా సమస్యలపై కలిసి పనిచేస్తామని సీపీఎం నేతలకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన మంగళవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పేదల సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కమ్యూనిస్టులంటే తనకు ప్రత్యేక అభిమానమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా అధ్యక్షుడు మూలం రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, ప్రసాద్, గోగుల శ్రీనివాస్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలూరు సుబ్బయ్యకు ఆత్మీయ పలకరింపు

నెల్లూరు రూరల్: రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి మంగళవారం 2వ డివిజన్ అల్లీపురానికి చెందిన టీడీపీ నేత పోలూరు సుబ్బయ్యను ఆత్మీయంగా పలకరించారు. సుబ్బయ్య నివాసానికి వెళ్లి ఎన్నికల్లో విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయ లోపం లేకుండా కష్టించి పని చేసినందు వల్లే తాను వరుసగా మూడోసారి ఎమ్మెల్యే అయ్యానని శ్రీధర్‌రెడ్డి చెప్పారు. అల్లీపురంలో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరినట్లు సుబ్బయ్య తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని సుబయ్య సన్మానించి, జ్ఞాపికను అందచేశారు.



ఎమ్మెల్యేకి జ్ఞాపిక అందచేస్తున్న సుబ్బయ్య

ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలొద్దు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్‌ను ఎవరూ అక్రమంగా తవ్వకాలు జరపవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఏలాంటి తవ్వకాలు జరపవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వచ్చే వరకు తవ్వకాలు ఆపాలన్నారు. దీనిని ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంద న్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులైనా సరే శిక్షార్హులేనని తేల్చి చెప్పారు. కాగా, తన కార్యాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో కోటంరెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

అదానీ పోర్టు సీఈవో శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం) : రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ గంటా వేణుగోపాలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించినందుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేటర్‌పై మాజీ వలంటీర్ల ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూన్ 18: సార్వత్రిక ఎన్నికల సమయంలో తమపై ఒత్తిడి తీసుకువచ్చి వలంటర్ ఉద్యోగాలకు రాజీనామా చేయించారంటూ 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌తోపాటు పలువురు వైసీపీ నాయకులపై మాజీ మహిళా వలంటీర్లు మంగళవారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు ముందు 37వ డివిజన్‌లో వలంటీర్లుగా పనిచేస్తున్న తమలాంటి వారిని రాజీనామా చేయాలని కార్పొరేటర్, వైసీపీ నాయకులు ఒత్తిడి చేశారని చెప్పారు. మళ్ళీ అధికారంలోకి వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని, రాజీనామా చేయకపోతే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరించారని వాపోయారు. తమతో రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న మహిళ వలంటీర్లు

మాఫియా ఆగడాలు అడ్డుకోండి

- అధికారులకు ప్రశాంతిరెడ్డి ఆదేశం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18 : సహజ వనరులను కొల్లగొట్టే గ్రావెల్, ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆమె నివాసంలో కోవూరు నియోజవర్గంలోని తహసీల్దార్లతో మంగ ళవారం సమావేశం నిర్వహించారు. ఇసుక పంపిణీకి సంబంధించి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించేంత వరకు నియోజకవర్గ పరిధిలోని రీచ్‌లనుంచి ఇసుక తరలింపు నిలిపివేయాలన్నారు. ఇసుక మాఫియా కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అక్రమ మైనింగ్, అడ్డగోలు రియల్ ఎస్టేట్ అనుమతులపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అవకతవకలు, అవినీతి జరిగినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాల్లో ఏ పార్టీ నేతలున్నా ఉపేక్షించవద్దని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కాకుపల్లిలో అన్నదానం

నెల్లూరు రూరల్, జూన్ 18 : మండలంలోని కాకుపల్లి పంచాయతీ సామంతులవారితోపు వద్దనున్న వైభోగ క్షేత్రంలో మంగళవారం అన్నదానం చేశారు. క్షేత్రం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మూడురోజుల వార్షికోత్సవాల్లో పాదుక పూజ, వైభోగ దివ్య మూర్తి ఊరేగింపు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రుషీ ప్రజ్ఞానంద స్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 18: నగరంలోని వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సోమశేఖర పురం, పొగతోట, బృందావనం, కాంప్లెక్స్ రోడ్డు ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

21న 5కే రన్

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 18 : జిల్లా ప్రణవ మహర్షి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 5కే రన్ నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం ఓ ప్రకటనలో పేర్కొంది. 21వతేదీ ఉదయం 5గంటలకు మాగుంట లే అవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై జాతీయ రహదారి వరకు రన్ సాగుతుందని తెలిపింది. అనంతరం ఆలయంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తామని, వివరాల కోసం 9966949500ను సంప్రదించాలని కోరింది.

హత్యాచార ఉన్మాదిని శిక్షించాలి

- ఏఐవైఎఫ్ నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 18 : చిన్నారి సహస్రపై అత్యాచారం, హత్యకు ఒడిగట్టిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని గాంధీబొమ్మ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దంపతులు నెల రోజుల కిందట ఉపాధి కోసం కాట్నపల్లి అనే గ్రామానికి వలస వచ్చారన్నారు. వారి ఆరేళ్ల కుమార్తెపై బిహార్‌కు చెందిన ఉన్మాది వినోద్(28) అత్యాచారానికి పాల్పడి ఆపై హత్య చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు షాన్‌వాజ్, వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నేతలు గౌస్, సర్దార్, షబ్బీర్, బాషా, రియాజ్, ఖాజా, బాబయ్య పాల్గొన్నారు.



పరిపాలన పట్టాలెక్కేదెప్పుడు?

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలనకు, అభివృద్ధికి సారథ్యం వహించేదెవరు? అధికార పార్టీని, పాలనను నడిపించేదెవరు? జిల్లాకు మంత్రి పదవి దక్కని నేపథ్యంలో నాయకత్వమూ కరువైన వేళ అందరిలో కదలాడుతున్న ప్రశ్నలివి. మరోవైపు జిల్లాలో అధికారుల బదిలీలు, నియామకాల ప్రక్రియ సైతం మొదలు కాలేదు. అసెంబ్లీ సమావేశాలు జరిగి కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశాక అధికారికంగా ఎమ్మెల్యేలు నియోజకవర్గాల పాలనపై దృష్టి సారించనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు, నియామకాల ప్రక్రియ చేపట్టనుంది. దీంతో గత మార్చిలో ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచీ స్తంభించిన జిల్లా పాలన తిరిగి పట్టాలెక్కేందుకు మరింత వ్యవధి పట్టే అవకాశముంది.

రాష్ట్ర మంత్రివర్గం పూర్తిస్థాయిలో ఏర్పాటైపోయింది. ఇంకా ఒకరిని మంత్రిగా నియమించేందుకు సాంకేతికంగా అవకాశం వుంది కానీ నియమిస్తారో లేదో తెలియని పరిస్థితి.దీంతో జిల్లా నుంచీ ఎవరికైనా మంత్రి పదవి వస్తుందన్న ఆశలైతే ప్రస్తుతానికి లేవు. అందువల్ల జిల్లాలో ప్రభుత్వ పాలనకు, అభివృద్ధికి నాయకత్వం ఎవరు వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. అసెంబ్లీ మొదటి సమావేశాల అనంతరం ఇంచార్జి మంత్రుల నియామకం జరుగనుంది. ఆ క్రమంలో జిల్లాకు కూడా ఇంచార్జి మంత్రి రానున్నారు. అయితే ఇంచార్జి మంత్రి అడపాదడపా మాత్రమే జిల్లాకు వచ్చి వెళ్ళే పరిస్థితి వుంటుంది. అదే జిల్లాలోనే మంత్రి వుంటే రెగ్యులర్‌గా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలును పర్యవేక్షించే అవకాశముంటుంది. జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంతో పాటు అమలుకు ప్రయత్నించే వీలుంటుంది. నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు జిల్లాస్థాయిలోనే మంత్రిని ఆశ్రయించి పనులు చేసుకునే వెసులుబాటు వుంటుంది. మరో కోణంలో చూస్తే అధికార పార్టీకి కూడా జిల్లాలో నాయకత్వం కరువైన పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి కొందరు ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డిని, మరికొందరు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని ఆశ్రయిస్తున్నారు. నెల్లూరు నుంచీ జిల్లాలో కలసిన గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించిన మంత్రి నారాయణను ఆశ్రయించే పరిస్థితి. ఫలితంగా తిరుపతి జిల్లాకంటూ ఓ అధికార కేంద్రం లేకుండా పోయింది.టీడీపీకి కూడా తగిన నాయకత్వం అందుబాటులో లేకుండా పోతోంది.

బదిలీలు, నియామకాలు కొలిక్కి వస్తేనే...

గత మార్చి 16న ఎన్నికల షెడ్యూలు వెలువడిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. మే 13న పోలింగ్ జరగగా ఈనెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఈ మేరకు మార్చి నుంచీ జిల్లాలో ప్రభుత్వ పాలన మందగించింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారితే జిల్లాస్థాయి నుంచీ మండల స్థాయి వరకూ అధికార యంత్రాంగం బదిలీలకు లోనుకావడం సర్వ సాధారణంగా జరిగేదే. దానికనుగుణంగా ఇపుడు జిల్లాలో కూడా కలెక్టర్, ఎస్పీలు మొదలుకుని జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు జరగనున్నాయి. సీఎం ఇష్టాయిష్టాల మేరకు కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ తదితరుల నియామకం జరుగుతుంది. ఇక మిగిలిన జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల నియామకం జిల్లాలో ఎమ్మెల్యేల సిఫారసు మేరకు జరగనుంది. అదే విధంగా ఎన్నికల ముందు బదిలీపై వచ్చిన డిప్యూటీ కలెక్టర్లు, డీఎస్పీలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీపై వెళ్ళనున్నారు. ఆయా స్థానాల్లోకి కొత్త అధికారులు రానున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల కమిషనర్లదీ అదే పరిస్థితి. వీరిలో ఎవరు జిల్లాలోనే కొనసాగుతారో ఎవరు బదిలీపై వెళతారో ఇదమిద్ధంగా చెప్పలేని పరిస్థితి. ప్రస్తుతానికి టీటీడీకి మాత్రమే రెగ్యులర్ ఈవో నియమితులయ్యారు. నెలాఖరుకు గానీ ఈ బదిలీలు, నియామకాలు ఒక కొలిక్కి వచ్చే అవకాశం లేదు. అవన్నీ పూర్తయ్యాక గానీ జిల్లాలో పాలన పట్టాలెక్కే పరిస్థితులు కనిపించడం లేదు.

24 నుంచీ ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి నిర్వహించిన ఏపీఆర్‌సెట్ ఇంటర్వ్యూలు ఈ నెల 24 వ తేదీ నుంచీ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. దేవప్రసాదరాజు మంగళవారం తిరుపతిలో వెల్లడించారు. 24 నుంచీ 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూల ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూలు చేపడుతున్నట్టు తెలిపారు. 10 వేల మంది ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేయగా, ఇందులో 4,352మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఉత్తీర్ణులైన వారికి ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్ట్‌మెంట్లలోనే ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సమగ్ర వివరాల కోసం.. హెచ్‌టీటీపీఎస్.సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.గవర్నమెంట్. ఇన్.. వెబ్‌సైట్ చూడాలని కన్వీనర్ దేవప్రసాదరాజు కోరారు.

వయోవృద్ధుల దర్శనంపై పుకార్లను నమ్మొద్దు: టీటీడీ

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి):తిరుమలలో వయోవృద్ధుల దర్శనానికి సంబంధించి తప్పుదోవ పట్టించే కొన్ని వార్తలు సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ' రోజూ వెయ్యిమంది వయోవృద్ధులకు, దివ్యాంగులకు దర్శనాలకు సంబంధించి టీటీడీ ప్రతి నెలా 23వ తేది మధ్యాహ్నం 3 గంటలకు మూడు నెలల ముందుగానే ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తోందని తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ టికెట్లు ఆగస్టు నెల వరకు బుక్కయ్యాయని పేర్కొంది. టికెట్ పొందిన వ్యక్తికి రూ.50విలువ చేసే లడ్డూ ఉచితంగా లభిస్తుందని,తిరుమల నంబి ఆలయానికి ఆనుకుని ఉన్న సీనియర్ సిటిజన్(పీహెచ్‌సీ) లైన్ ద్వారా రోజూ మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారని వివరించింది.కాబట్టి సోషల్‌మీడియాలో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని టీటీడీ కోరింది. దీనికి సంబంధించిన వివరాల కోసం 'తిరుమల.ఓఆర్జీ', 'టీటీదేవస్థానమ్స్.ఏపీ. జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించింది.

నేటినుంచి శ్రీవారి జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు జ్యేష్ఠాభిషేక ఉత్సవాలు జరుగనున్నాయి. అభిషేకాలు, పంచామృత స్నపన తిరుమంజనాల కారణంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే ఉత్సవమే జ్యేష్ఠాభిషేకం. మొదటిరోజు ఉత్సవమూర్తులకు హోమాలు, అభిషేకాలు, పంచామృత స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు వజ్రకవచాన్ని అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు ముత్యాల కవచ సమర్పణ చేసి ఊరేగిస్తారు. మూడవరోజు కూడా తిరుమంజనాదులు పూర్తిచేసి బంగారు కవచాన్ని సమర్పించి ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ బంగారు కవచాన్ని మళ్లీ వచ్చే ఏడాది జ్యేష్ఠాభిషేకంలోనే తీస్తారు. అంతవరకూ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు కవచంతోనే ఉంటారు. కాగా, జ్యేష్ఠాభిషేకం కారణంగా శ్రీవారి ఆలయంలో జూన్21వ తేదీ కల్యాణోత్సవ, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. తోమాల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు.

ఏపీ పీజీఈ సెట్‌లో 90.44 శాతం ఉత్తీర్ణత


చైతన్య


వంశీ


మహేశ్వరి


భవిష్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 18: ఫార్మసీ, ఇంజనీరింగు పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ పీజీఈ సెట్-2024 ఫలితాలను ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మంగళవారం తిరుపతిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గత నెల 29 నుంచీ 31వ తేదీ దాకా పరీక్షలు నిర్వహించామన్నారు. 13 సబ్జెక్టులకు 10,143 మంది దరఖాస్తు చేశారన్నారు. వీరిలో 8706 మంది పరీక్షలు రాశారని తెలిపారు.90. 44 శాతం అంటే 78744 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.ఫలితాల కోసం..హెచ్‌టీటీపీఎస్.సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపి.గవర్నమెంట్.ఇన్. పీజీసెట్స్. వెబ్‌సైట్ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీజీఈసెట్ కన్వీనర్ రమాశ్రీ, వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా ర్యాంకర్లు వీరే

నానో టెక్నాలజీ విభాగంలో తిరుపతి నగరం జీవకోనకు చెందిన ఎ.వంశీ 42మార్కులతో 5వ ర్యాంకును, ఎస్.మహేశ్వరి 41మార్కులతో 6వ ర్యాంకును సాధించారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లెకు చెందిన జి.భవిష్య కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగు విభాగంలో 74మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, చిత్తూరు రైల్వే క్వార్టర్స్‌కు చెందిన వై.చైతన్య 71మార్కులతో మూడవ ర్యాంకును సాధించారు.

రియాలిటీ హాట్ స్పాట్ సిటీగా తిరుపతి



దేశవ్యాప్తంగా 17 ప్రతిపాదిత నగరాలు

దక్షిణాదిన 4 నగరాల్లో తిరుపతికి చోటు

తిరుపతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలుగా విలసిల్లుతున్న 17 నగరాలు రానున్న కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ ఇండియా సంస్థ ప్రకటించిన జాబితాలో తిరుపతికి చోటు దక్కింది. రియల్ ఎస్టేట్ రంగంలో విశేష పేరు ప్రఖ్యాతులున్న ఈ సంస్థ దేశవ్యాప్తంగా అధ్యయనం నిర్వహించి రూపొందించిన నివేదికను తాజాగా విడుదల చేసింది. దీనికోసం దేశం మొత్తం మీద రియల్ ఎస్టేట్‌పరంగా అత్యధిక గ్రోత్ రేట్ వున్న వందకు పైగా నగరాలలో అధ్యయనం కొనసాగించింది. వాటిలో ముందు వరుసలో నిలిచిన 30 నగరాలను ఎంపిక చేయగా అందులో ఆధ్యాత్మిక పర్యాటక రంగం కేటగిరీ కింద 17 నగరాలను గుర్తించింది. ఈ 17 నగరాల్లో అయోధ్య, వారణాసి, పూరి, ద్వారక, షిర్డి, అమృత్‌సర్ తదితరాలతో పాటు తిరుపతి కూడా వుండడం గమనార్హం. ఇక్కడ ఆధ్యాత్మిక పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందడానికి అవకాశముందని కొలియర్స్ సంస్థ అభిప్రాయపడింది. వీటి మూలంగా రియల్ ఎస్టేట్ రంగం సైతం గరిష్ఠంగా అభివృద్ధి చెందడానికి వీలు కలుగుతుందని అంచనా వేసింది. రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్ సిటీస్‌గా ఒకటిగా సంబంధిత సంస్థ గుర్తించిన తిరుపతి దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 17 నగరాల్లో ఒకటి కాగా అదే దక్షిణ భారతదేశం నుంచీ ఎంపికైన నాలుగు నగరాల్లో ఒకటి కావడం విశేషం. దక్షిణాదిన కోయంబత్తూరు, కొచ్చిన్, తిరుపతి, విశాఖపట్టణం ఎంపికయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్డు కనెక్టివిటీని పెంచడం, నూతన విమానాశ్రయాలను ఏర్పాటు చేయడం, ప్రత్యేక రైలు సర్వీసులు నడపడం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాలికంగా అటు ఆతిథ్య రంగంలోనూ, ఇటు రియల్ ఎస్టేట్ రంగంలోనూ అనూహ్య అభివృద్ధి సాధ్యమవుతుందని కొలియర్స్ ఇండియా సంస్థ భావిస్తోంది.

ఇప్పటికే ఊపందుకున్న నగర విస్తరణ


ఇప్పటికే తిరుపతి నగరం అర్బన్ మండల పరిధిని దాటి రూరల్ మండలం, చంద్రగిరి, రేణిగుంట, వడమాలపేట, రామచంద్రాపురం, ఏర్పేడు మండలాల్లోకి విస్తరించిన సంగతి తెలిసిందే. తిరుపతి కేంద్రంగా పరిసరాల్లోని ఈ మండలాల్లోకి నగరం వేగంగా విస్తరిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఊపందుకుంటున్నాయి. తిరుపతి నుంచీ కడప, నెల్లూరు, చెన్నై, చిత్తూరు, మదనపల్లె వెళ్ళే మార్గాలు జాతీయ రహదారులు కావడం రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందడానికి ఊతమిస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో పాటు చుట్టుపక్కల అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాలు వుండడంతో పలువురు ఉన్నత స్థాయి వ్యక్తులు సైతం విశ్రాంత జీవితాన్ని తిరుపతి, తిరుపతి పరిసరాల్లో గడిపేందుకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. దీనివల్ల ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసి నివాసాలు ఏర్పరుచుకోవడం, అపార్టుమెంట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేయడం క్రమేపీ పెరుగుతోంది. దీనివల్ల అపార్టుమెంట్ల సంఖ్య కూడా ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. తాజాగా కొలియర్స్ ఇండియా సంస్థ వేసిన అంచనాల ప్రకారం చూస్తే రానున్న కాలంలో నగర విస్తరణ మరో స్థాయిని అందుకోవడం ఖాయమనిపిస్తోంది.

ఆదేశాల అమలేదీ?

తోతాపురి ధరపై కలెక్టర్లు చెప్పినా పట్టించుకోని పల్ప్ ఫ్యాక్టరీలు,వ్యాపారులు

పుత్తూరు అర్బన్, జూన్ 18: తోతాపురి రకం మామిడిని టన్ను రూ.30 వేలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని ఆదివారం తిరుపతి, చిత్తూరు కలెక్టర్లు పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినా అమలుకు నోచుకోలేదు. టన్ను రూ.21-22 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ధర పెంచి... అమాంతం తగ్గించి...



పల్ప్ ఫ్యాక్టరీలు విరివిగా ఉపయోగించే తోతాపురి రకం ధర పుత్తూరు మార్కెట్‌లో ఈ ఏడాది ఆశాజనకంగానే ప్రారంభమైంది. తొలుత రూ.20 వేల నుంచి ప్రారంభమై ఈ నెల 4వ తేదీకి రూ.28 వేలకు చేరుకుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి దిగుబడి పూర్తి తగ్గిపోయింది. సరాసరి 20 శాతం కూడా దిగుబడి రాకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న అరకొర పంటను మార్కెట్‌కు తరలించి పెట్టుబడిలో కొంతైనా రాబట్టుకుందామనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. ధరను చూసి కోతలు ప్రారంభించడంతో మార్కెట్ వర్గాలు ధరను అమాంతం తగ్గించేశాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం టన్ను కాయలను పల్ప్ ఫ్యాక్టరీలు రూ.22 వేలకు కొనుగోలు చేస్తుండగా, వ్యాపారులు మాత్రం మండీల్లో రూ.21 వేలు చెల్లిస్తున్నారు. సాధారణంగా సీజన్ ముగింపు సమయానికి ధరలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ సిండికేట్ కారణంగా ఆ ఆశ కూడా లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

వారికిది మామూలే....

గత ఏడాది కూడా తోతాపురి ధర రూ.10 వేలకు పడిపోవడంతో చిత్తూరు కలెక్టర్ జోక్యం చేసుకున్నారు. సీజన్ ప్రారంభంలోనే రూ.19వేలకు కొనుగోలు చేయాలని పల్ప్ ఫ్యాక్టరీ యాజమాన్యాలకు స్పష్టం చేశారు. ఆ ఆదేశాలు అమలు కాకపోవడంతో రూ.15 వేలకు కొనుగోలు చేయాలని సూచించారు.ఆ ఆదేశాలనూ ఫ్యాక్టరీ యాజమాన్యాలు పట్టించుకోలేదు. దీంతో వ్యాపారులు చెప్పిన ధరకే పంటను రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఇద్దరు కలెక్టర్లు ఆదేశించినా పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు, వ్యాపారులు పట్టించుకోలేదు. కలెక్టర్ల ఆదేశాలను అమలు చేయడంలో ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు. మండీలు, ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ధరలను తగ్గించేస్తున్నారంటున్నారు.పది రోజుల్లో సీజన్ ముగియనుంది.ఇప్పటికే పంట నేల రాలిపోతుండడంతో వ్యాపారులు నిర్ణయించిన రూ.21 వేలకే రైతులు విక్రయించాల్సివస్తోంది.

ఆరేళ్లుగా సంక్షోభమే

2018లో మామిడి ధరలు పతనమయ్యాయి. అప్పటి టీడీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని కిలో మీద రూ.2.50 ఇచ్చి రైతులను ఆదుకుంది. 2019లో అకాల వర్షాలతో పంట దెబ్బతింది. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా ఎగుమతి చేసుకోలేని పరిస్థితి. 2022లో దిగుబడి లేకుండా పోయింది.2023లో దిగుబడి వచ్చినా ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధర ఇవ్వలేదు. ఇప్పుడేమో వాతావరణ ప్రతికూల పరిస్థితులతో దిగుబడి 20శాతానికి పడిపోయింది.సిండికేట్ కారణంగా ధరలు మరింత తగ్గాయి.

ఇష్టానుసారం రోడ్లను తవ్వితే సహించేది లేదు

● ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 18: గ్యాస్ పైప్ లైన్ల కోసం పట్టణంలో ఎక్కడపడితే అక్కడ రోడ్లను తవ్వి గుంతలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో గ్యాస్‌లైన్ ఏజెన్సీ నిర్వాహకులు, మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్యాస్‌పైప్‌లైన్ల కోసం రోడ్లను ధ్వంసం చేయడంతో ప్రజలు అవస్థలు పడ్డారన్నారు. తాగునీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు చేసుకోవాలన్నారు. పనులను మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. ఇప్పటివరకూ తవ్వి వదిలేసిన గుంతలపై ప్యాచ్‌వర్కులు పూర్తి చేయాలన్నారు. గుంతల వల్ల ఇబ్బంది కలిగితే అధికారులు లేదా తన దృష్టికి కాని తీసుకురావాలన్నారు. శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలి



యూనియన్ నాయకులను సత్కరిస్తున్న శంకరరావు

గూడూరు అర్బన్, జూన్ 18: కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్ వద్ద సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సర్వీసులో చేరిన రైల్వే కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సేఫ్టీ విభాగంలో అందరికీ రిస్క్ అలవెన్సు ఇవ్వాలన్నారు. స్థానిక సమస్యలపె శంకరరావుకు రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు మయూరి శ్యామ్‌యాదవ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం రక్తదానశిబిరం నిర్వహించారు.శ్రీనివాసరావు, రామగుప్తా, శేఖర్‌బాబు, నాగేశ్వరరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి బీజేపీ కార్యకర్తల కృషి



మాట్లాడుతున్న బాలకృష్ణమనాయుడు

గూడూరు, జూన్ 18: గూడూరులో కూటమి అభ్యర్థి విజయంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి అభినందనీయమని పార్టీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక నరశింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ గెలుపునకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. దయాకర్, జీవి నాయుడు, ప్రభాకర్‌రావు, మహేష్, శ్రీనివాసరావు, వెంకటేష్, సురేష్, హరికృష్ణ, శివ, రమేష్, భవాని, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాశింకు పలువురి అభినందనలు

గూడూరు అర్బన్, జూన్ 18: ఎమ్మెల్యేగా ఎన్నికైన పాశిం సునీల్‌కుమార్‌ను మంగళవారం పలువురు నాయకులు, వివిధ యూనియన్ల నాయకులు ఆయన నివాసంలో సన్మానించారు. జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు కలసి అభినందనలు తెలిపారు. శివకుమార్, బాలసుబ్రమణ్యం, మనోజ్, భాస్కర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్టీసీడిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. నారాయణ, సుబ్బారావు, జిలాని పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర వేడుకలు



పెళ్లకూరు, జూన్ 18 : జీలపాటూరులో మంగళవారం వైభవంగా గంగమ్మ జాతర వేడుకలు నిర్వహించారు. ఆలయాన్ని పలు రకాల పూలతో, చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. మహిళలు ఉదయం అంబళ్లను తీసుకొని గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మ వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బస్సు ఢీ కొని వృద్ధుడి మృతి



నాయుడుపేట టౌన్, జూన్ 18 : నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో బస్సు ఢీ కొని వృద్ధుడు చెంగయ్య (75) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పండ్లూరుకు చెందిన చెంగయ్య మంగళవారం ఉదయం రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్తుండగా నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు వస్తున్న బస్సు ఢీ కొంది. చెంగయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని ట్రాఫిక్ చక్కదిద్దారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్‌లో అగ్ని ప్రమాదం



కాలిపోయిన కొయ్య వ్యర్థాలు

తడ, జూన్ 18 : కారూరుమిట్టలోని డంపింగ్‌యార్డ్‌లో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అదుపుచేశారు. పరిశ్రమల కొయ్య వ్యర్థాలు కొంతమేర కాలిపోయాయి. పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకోకుండా స్థానికులు చొరవ తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ నెల 10న మాంబట్టు సెజ్‌లోని ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల వ్యర్థాల డంపింగ్ యార్డ్‌లో మూడు రోజులపాటు మంటలు అదుపులోకి రాని సంగతి తెలిసిందే. ప్లాస్టిక్ వ్యర్థాలే ఇందుకు కారణం. తడలో ఇటువంటి డంపింగ్‌యార్డ్‌లు ఎక్కువగా ఉన్నాయి. భద్రతా ప్రమాణాలు లేకుండా, అనుమతులు లేకుండా వీటిని నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి. నిర్మానుష ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ సర్వీసుల పునరుద్ధరణకు వినతి



రామ్‌ప్రసాద్‌రెడ్డితో చిట్టమూరు టీడీపీ నాయకులు

చిట్టమూరు, జూన్ 18 : రవాణా శాఖా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని చిట్టమూరు టీడీపీ నాయకులు మంగళవారం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు, మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కస్తూరయ్యలు అమరావతి సచివాలయంలో కలసి శాలువా కప్పి సత్కరించారు. చిట్టమూరు నుంచి తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌లకు గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కిషోర్‌నాయుడు తెలిపారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

వెంకటగిరి, జూన్ 18: ఎస్ఎస్ ట్యాంకు నుంచి తాగునీరు అందించే పైప్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని తెలిపారు.

ప్రతిభావంతులకు ఎన్ఆర్ఐ ప్రోత్సాహక బహుమతులు



గూడూరు అర్బన్, జూన్ 18: అయ్యవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వైష్ణవి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని సాధించుకునేందుకు కష్టపడాన్నారు. పాఠశాలలో 505 మార్కులు సాధించిన ప్రవీణకు రూ.10 వేలు, 475 మార్కులు సాధించిన చెంచురత్నానికి రూ. 5 వేలు, 473 మార్కులు సాధించిన సంధ్యకు రూ. 2,500 నగదు వంతున ప్రోత్సాహాన్ని అందించారు. మంజులమ్మ, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, హెచ్ఎం ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై ఏబీవీపీ నిరసన

సూళ్లూరుపేట, జూన్ 18: అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సన్నీ కోరారు. మంగళవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయన్నారు. పుస్తకాల ముసుగులో దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎంఈవో శీనయ్యకు వినతిపత్రం అందజేశారు. ఏబీవీపీ నాయకులు వెంకటేశ్, హర్షిత్, చందు, శ్రీమంత్, దేవ, రాకేష్, దినేష్, పవిత్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వెంకటగిరి టౌన్, జూన్ 17: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎన్ఎం సామ్రాజ్యం సూచించారు. మంగళవారం స్థానిక టీపీ కండ్రిగలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-45ఏళ్లలోపు సికిల్‌సెల్ అనీమియా వ్యాధి పరీక్షలు నిర్వహించామన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అలపలేరు డ్యాంపై చిగురించిన ఆశలు

- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ
- తగ్గిపోయిన నీటి సామర్థ్యం
- మరమ్మతులు చేస్తే మంచి రోజులు



డ్యాం లోపల పిచ్చి మొక్కలు (ఫైల్ ఫోటో)

దక్కిలి, జూన్ 18 : సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే పాతనాలపాడు సమీపంలోని అలపలేరు డ్యాం దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుంటుందని వీరంతా ఆశిస్తున్నారు. 50 ఏళ్ల క్రితం వెలికంటి ఏరుకు అడ్డంగా అలపలేరు డ్యాం నిర్మించారు. వర్షాధారంతో నిండే ఈ డ్యాం పాతనాలపాడు, బ్రాహ్మణపల్లి, చాకలపల్లి, బీమవం, దగ్గవోలు, మోపూరు గ్రామాల్లోని సుమారు 2వేల ఎకరాలకు సాగు నీరందించేది. వైసీపీ హయాంలో డ్యాంకు ఎలాంటి మరమ్మతులూ చేపటలేదు. దీంతో కట్టలు బాగా బలహీన పడ్డాయి. డ్యాం లోపల భాగమంతా పిచ్చి మొక్కలతో నిండి పోయింది. గతంలో చోరీ అయిన షట్టర్ల స్థానంలో ఇప్పటికీ కొత్తవి ఏర్పాటు చేయలేదు. దీనివల్ల నీటి సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ప్రస్తుతం 500 ఎకరాలకు మించి సాగునీరందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే కట్టలకు ప్రమాదం ఉందని వీరు చెబుతున్నారు. డ్యాం కలుజు కూడా దెబ్బతింది. కలుజు షటర్లు లేకపోవడంతో వెలికంటి ఏటి ద్వారా డ్యాం లోకి చేరే వర్షపు నీరు వృథాగా సముద్రం పాలవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలకులు డ్యాంపై పైసా వెచ్చించక ఈ పరిస్థితి దాపురించిందంటున్నారు. డ్యాం ద్వారా సాగునీరు అందించే ప్రధాన కాలువలు కూడా పూడిపోయాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చొరవ తీసుకుని డ్యాంకు మరమ్మతులు చేయించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పులికాట్ స్థితిగతులపై జూలై 19న ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశ ఉత్తర్వులను అందజేస్తున్న కిషోర్

తడ, జూన్ 18 : పులికాట్ తీరప్రాంత నిర్వహణ, అభివృద్ధిపై ప్రజాభిప్రాయ సేకరణకు జూలై 19న నేలపట్టులో సభను ఏర్పాటు చేస్తామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్టు కిషోర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సభకు తీర ప్రాంత ప్రజలు హాజరయ్యేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పులికాట్ సరస్సు తీరప్రాంత ప్రస్తుత పరిస్థితులపై నివేదిక తయారుచేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డును కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ ఆదేశించిందన్నారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, చిట్టమూరు, వాకాడు, కోట, చిల్లకూరు మండలాల తీరప్రాంత ప్రజల నుంచి వివరాలు సేకరించేందుకు సభను నిర్వహించనున్నామన్నారు. అభ్యంతరాలు సూచనలను ప్రజలు ప్రస్తావించవచ్చన్నారు. ఆమేరకు ప్రజలకు అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి అజెండా : నెలవల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నెలవల

సూళ్లూరుపేట, జూన్ 18: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని మరిచి ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు దిగిందని మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం విమర్శించారు. తాము ఆ.ధోరణికి స్వస్థి పలికి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. మంగళవారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ నివాసంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016లోనే టీడీపీ హయాంలో సూళ్లూరుపేట దాహార్తిని తీర్చేందుకు మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మించి తాగునీరందించేందుకు రూ.162 కోట్లు మంజూరయ్యాయన్నారు. నాయుడుపేటలో కూడా రూ.149 కోట్లతో సమ్మర్ స్టోరేజ్‌కు శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ ఐదేళ్లు వీటి గురించి పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వ పాలనలో సమ్మర్ స్టోరేజ్ పూర్తిచేసి తాగునీరందించేందుకు చొరవ తీసుకుంటామన్నారు. పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, బొమ్మన్ శ్రీధర్, నీలకంఠం, విజయనాయుడు, జీవా పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు



గూడూరు, జూన్ 18: స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం విష్వక్సేనారాధనమ్, పుణ్యాహవచనమ్, నిత్యహోమం పూజలు జరిపారు. అనంతరం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

త్వరితగతిన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి



ఆర్అండ్‌బీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వరప్రసాదరావు

గూడూరు, జూన్ 18: గూడూరులో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను త్వరిగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు కోరారు. మంగళవారం విజయవాడలో ఆయన ఆర్అండ్‌బీ చీఫ్ మేనేజర్ మాధవీసుకన్యను కలసి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పనులు తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గపరిధిలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, రాష్ట్రప్రభుత్వ సహకారంతో కేంద్రం నిధులు తీసుకువచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. శ్రీనివాసులు, వినీష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 18: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5-18 ఏళ్ల లోపు వయసున్న బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన బాలలు జూలై 31వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా 2025 జనవరిలో బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మలేరియాపై అవగాహన



అవగాహన ర్యాలీలో డాక్టర్ రాజేష్

వెంకటగిరిటౌన్, జూన్ 18: వర్షకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెంకటగిరి అర్బన్ సీహెచ్‌సీ డాక్టర్ రాజేష్ సూచించారు. మంగళవారం స్థానిక పాతకోట పరిధిలోని పలు ప్రాంతాల్లో మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు గుడ్లు పెట్టకుండా నీటి గుంటలు పూడ్చలని కోరారు. దోమతెరలు వాడుకోవాలన్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పగిలిపోయన కుండ పెంకులు, కుండీలు, టీ కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.



విజయశ్రీ దంపతులకు సత్కారం

నాయుడుపేట, జూన్ 18 : టీడీపీ ఆవిర్భావం నుంచి కీలకపాత్ర పోషిస్తున్న దివంగత సీనియర్ నాయకుడు గూడూరు రఘునాథరెడ్డి చిరస్మరణీయుడని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలోని రఘునాథరెడ్డి ఇంటిలో మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మను కలిశారు. కూటమి విజయంపై గృహంలో ఎమ్మెల్యే విజయశ్రీ-పార్థసారథి దంపతులు శుభాకాంక్షలు తెలియజేశారు. రఘునాథరెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ-పార్థసారథి దంపతులను ప్రభావతమ్మ సత్కరించారు. తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, గూడూరు సుధీర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పోలయ్యయాదవ్, సందీప్, గోపాల్, షేక్ కాలేషా, జాకీర్ తదితరులు ఉన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న క్రీడాకారులు

ఆటస్థలం కబ్జాపై ఫిర్యాదు

కోట, జూన్ 18 : కేశవరంలోని క్రీడా ప్రాంగణాన్ని కొంతమంది కబ్జా చేస్తున్నారని అక్కడి క్రీడాకారులు మంగళవారం తహసీల్దారు నాగరాజారావుకు ఫిర్యాదు చేశారు. పాతికేళ్లుగా మద్దాలికి వెళ్లే రోడ్డులో ప్రభుత్వ భూమిని చిట్టేడు, కేశవరం, మద్దాలి పంచాయతీలకు చెందిన తాము క్రీడా ప్రాంగణంగా ఉపయోగించుకుంటున్నామన్నారు. సర్వే నెంబరు 193లోని ఈ ప్రభుత్వ భూమిని స్థానికంగా కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. తక్షణం స్పందించి కబ్జాదారుల నుంచి కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై తక్షణ చర్యలు చేపడతామని తహసీల్దారు నాగరాజారావు హామీ ఇచ్చారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.64 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 75,872 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 37,236 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో త్రివిక్రమ్



తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మాటల మాంత్రికుడు, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆయన మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. పద్మావతి అమ్మవారిని కూడా మంగళవారం త్రివిక్రమ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి 54వ గంధోత్సవాలు



నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం, జూన్ 17: పుత్ర సంతాన ప్రాప్తినిచ్చే దైవంగా హుస్సేనమ్మ దర్గా ప్రాచుర్యం పొందుతోంది. దొరవారి సత్రం మండలం నెలబల్లిలో జాతీయ రహదారి పక్క న హుస్సేనమ్మ దర్గాను దర్శించు కంటే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు విచ్చేసి హుస్సేనమ్మను దర్శించుకుంటారు. దర్గా ఉన్న నెల బల్లిలో ఒక్క ముస్లిం కుటుంబం కూడా లేక పోయినప్పటికీ ఏటా క్రమం తప్పకుండా గంధోత్సవాలను నిర్వహించడం ప్రత్యేకత. ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు కమిటీ పేర్కొంది.

ఇదీ దర్గా విశిష్టత

వంద సంవత్సరాల క్రితం నెలబల్లిలో ముస్లిం కుటుంబానికి చెందిన హుస్సేనమ్మ చనిపోతే రహదారి పక్కన పూడ్చినట్లు చెబుతారు. అక్కడే ఒక రావి చెట్టు పెరిగింది. నెమిలిమిట్ట అగ్రహారానికి చెందిన హంసయ్య అనే వ్యక్తి నెలబల్లి గ్రామ దారిన నడిచి వెళ్తూ మధ్యాహ్నం కావడంతో రావిచెట్టు కింద నిద్రించాడు. ఆయనకు కలవచ్చింది. అందులో ఓ మహిళ తాను హుస్సేనమ్మ అని, దర్గా ఏర్పాటు చేసి పూజలు చేయాలని కోరింది. ఈక్రమంలో హంసయ్య దర్గా ఏర్పాటు చేసి పూజలు చేయడం ప్రారంభించారు. అలా హం సయ్య కుటుంబీకుల నుంచి దర్గా బా గోగులు చూసుకోవడం నెలబల్లి గ్రా మస్తులు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన మాధవరెడ్డి దర్గా అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేశారు. 54వ గంధ మహోత్సవాలను ఈ ఏడాది నిర్వహిస్తున్నారు. దర్గాలో నిష్టగా 9 వారాల పాటు ప్రార్థనలు చేస్తే పుత్రసంతానం కలుగుతుందని నమ్మకం. అలా పుట్టిన తమ పిల్లలకు హుస్సేనయ్య, హుస్సేనమ్మ అని పేర్లు పెట్టుకుంటుంటారు.